# తొలివార్త

RNI : TGTEL/25/A0357

ప్రజా గళం మా కలం.....

www.tolivaartha.com

తెలుగు దిన పత్రిక

www.epaper.tolivaartha.com








ప్రచురణ : రంగారెడ్డి ఎడిటర్ : లింగాల నరేందర్ గౌడ్ సంపుటి : 02 సంచిక : 184 మంగళవారం 10 - 11 - 2026 వెల : 4/- పేజీలు : 08

Published From : Rangareddy , Circulated at : Hyderabad, Medchal, Malkajgiri, Suryapet, Nalgonda, Jangaon Khammam, Mahaboobnagar, Narayanpet, Warangal , Mancherial


## తెలంగాణ జిల్లాల్లో పూర్తి
# వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష
- ప్రతి జిల్లాలో డీసీహెచ్ఎస్ కార్యాలయాల ఏర్పాటుపై విస్తృత కసరత్తు
- కమ్యూనిటీ, ఏరియా, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 09 :

తెలంగాణలో సెకండరీ హెల్త్ కేర్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ప్రజలు చిన్న సమస్యలకు కూడా రాజధాని హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా, జిల్లాల్లోనే కార్పొరేట్ స్థాయి పూర్తి వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పునర్వ్యవస్థీకరణపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) కార్యాలయాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి వరకు స్పష్టమైన పాలనా బాధ్యతలు ఉండాలని మంత్రి పేర్కొన్నారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్సీ), ఏరియా - మిగతా 2 లో

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
# కలిస్తేనే అభివృద్ధి సాధ్యం



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- కరీంనగర్‌లో రూ.4 కోట్ల అర్బన్ డెవలప్‌మెంట్ పనులకు శంకుస్థాపన
- కేంద్రమంత్రి బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సంయుక్తంగా ప్రారంభం
- కరీంనగర్ డంప్ యార్డు సమస్యను పరిష్కరిస్తామని మంత్రుల హామీ

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 09 :

కరీంనగర్ జిల్లాలో రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి (అర్బన్ డెవలప్‌మెంట్) పనులకు - మిగతా 2 లో



## పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా పరిగి వద్ద అడ్డుకున్న వైనం
- రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడి

తొలివార్త, హైదరాబాద్, నవంబర్ 09 :

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా - మిగతా 2 లో

## శాంతియుత పరిష్కారాలకు
# అన్ని విధాలుగా భారత్ సిద్ధం

- జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై చర్చ
- రష్యా- ఉక్రెయిన్ యుద్ధం విషయంలో సంక్లిష్టతలు కొనసాగుతున్న వేళ జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు
- ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది



తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 09 :

రష్యాతో యుద్ధాన్ని ముగించి, శాంతియుత పరిష్కారాలను అన్వేషించేందుకు అన్ని విధాలా తోడ్పడేందుకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ప్రధాని మోదీ వివరించారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం విషయంలో - మిగతా 2 లో

## ఒక్క సంవత్సరంలో
# 300పైగా ఉగ్రవాదులు అరెస్టు



- ఎర్రకోట ఉగ్రదాడి జరిగి ఏడాది పూర్తయిన వేళ దేశవ్యాప్తంగా భద్రతా దళాలు హై అలర్ట్‌లో ఉన్నాయి
- భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది

తొలివార్త,ఢిల్లీ, నవంబర్ 09 :

దేశ రాజధాని దిల్లీలో ఎర్రకోట పేలుడు జరిగి ఓ ఏడాది గడిచిన నేపథ్యంలో కేంద్ర భద్రతా సంస్థలు దేశవ్యాప్తంగా నిఘాను కట్టుదిట్టం చేశాయి. భవిష్యత్తులో ఇలాంటి దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. గడిచిన ఏడాది కాలంలో సరిహద్దు అవతల నుంచి సాగుతున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై భద్రతా దళాలు భారీ దాడులు జరిపాయి. వీటిల్లో 300 మందికి పైగా ఉగ్రవాద ఆపరేటివ్‌లను అరెస్ట్ చేయగా, విదేశాల్లో తలదాచుకున్న 73 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులను భారతదేశానికి రప్పించారు.ఎర్రకోట - మిగతా 2 లో

## పంచాతీయ ఎన్నికల వరకు ఏపీ
## గ్రామీణ ప్రాంతాల్లో కోడ్ కొనసాగింపు




- ఏపీ వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఎత్తివేత
- నవంబర్ 7 రాత్రి 10 గంటల నుంచే కోడ్ ఎత్తివేత నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు వెల్లడి
- పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నందున గ్రామీణ ప్రాంతాల్లో కోడ్ కొనసాగింపు - మిగతా 2 లో

## అమ్మవారి నాణెం కోసం
## చార్మినార్ వద్ద పోటెత్తిన భక్తులు



- భాగ్యలక్ష్మి ఆలయానికి భారీగా భక్తుల రాక
- ఆదివారం సాయంత్రం ప్రారంభమైన నాణేల పంపిణీ
- గుల్జార్ హౌస్ వరకు భక్తుల క్యూలైన్లు
- మూడు రోజుల పాటు పంపిణీ కార్యక్రమం
- అమ్మవారి నాణెంతో శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం - మిగతా 2 లో

## తెలంగాణ హైకోర్టు
# సంచలన తీర్పు



- జిల్లా కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి 6 నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టు
- కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ
- గడువు దాటినా స్పందించకపోవడంతో కలెక్టర్‌పై చర్యలు - మిగతా 2 లో

# అభివృద్ధికి దక్కిన
# ఆమోదం ఈ విజయం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అందరికీ కృతజ్ఞతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రాష్ట్రంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించామని సీఎం చంద్రబాబు అన్నారు
- 2024 సార్వత్రిక ఎన్నికల కంటే కూటమికి ప్రజాదరణ పెరిగిందని వివరించారు
- స్థానిక ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు మీడియా సమావేశం




తొలివార్త,అమరావతి, నవంబర్ 09 :

స్థానిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీని మరింతగా తిరస్కరించి కూటమికి ఘన విజయాన్ని అందించారని తెలుగుదేశం అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. పట్టణాలు, పల్లెలు, అన్ని వర్గాల్లోనూ కూటమికి ఒకే తరహా మద్దతు లభించిందని తెలిపారు. ప్రశాంతంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని చెప్పారు. కూటమి అభ్యర్థులను గెలిపించిన రాష్ట్ర ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని చంద్రబాబు అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధికి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమే ఈ ఫలితాలని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల కంటే కూటమికి ప్రజాదరణ పెరిగిందని వివరించారు.కేడర్ బేస్ పార్టీ టీడీపీ అని, సేవా భావమే తమ రాజకీయ విధానమని చంద్రబాబు తేల్చిచెప్పారు. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కూటమిగా పని చేశామని, అన్ని జిల్లాల్లోనూ ప్రజలు కూటమి వైపే మొగ్గు చూపారని తెలిపారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, - మిగతా 2 లో

## లోకేశ్ ఆదేశాలతోనే
# తప్పుడు కేసులు




- మాజీ మంత్రి అంబటి రాంబాబు
- గుంటూరు జైల్లో లేళ్ల అప్పిరెడ్డిని ములాఖత్‌లో పరామర్శించిన అంబటి రాంబాబు
- కూటమి సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మాజీ మంత్రి ఆరోపణ
- చిన్న ఘటనను అడ్డం పెట్టుకుని కుట్రపూరితంగా జైలుకు పంపారని మండిపాటు

తొలివార్త,అమరావతి, నవంబర్ 09 :

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... ఇందులో భాగంగానే వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు - మిగతా 2 లో

# సంపాదకీయం

## పరిపూర్ణ ప్రజాస్వామిక వ్యక్తిత్వం




చట్టసభల్లో చర్చలు అర్థవంతంగా సాగడానికి, ప్రజాస్వామ్య సంప్రదాయాలు పరిఢవిల్లడానికి సభాపతి పాత్ర అత్యంత కీలకం. రాజ్యాంగ పరిజ్ఞానం, న్యాయ శాస్త్రంపై పట్టు, రాజకీయ అనుభవం, నిష్పాక్షిక దృక్పథం కలగలిసిన వ్యక్తిత్వం సభాపతి స్థానానికి వన్నె తెస్తుంది. అటువంటి విశిష్ట వ్యక్తిత్వం కలిగినవారు డాక్టర్ ఎ.చక్రపాణి.1943 జనవరి 1న కర్నూలు జిల్లా హుస్సేన్‌పురంలో జన్మించిన చక్రపాణి బి.ఏ., ఎల్.ఎల్.బి., ఎల్.ఎల్.ఎం.తో పాటు న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ, ఎల్.ఎల్.డి పట్టాలు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల విద్యార్థి సంఘ అధ్యక్షుడిగా, అనంతరం విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. న్యాయశాస్త్రంపై ఆయనకున్న పరిజ్ఞానం, రాజ్యాంగ వ్యవస్థపై అవగాహన ఆయన ప్రజాజీవితానికి బలమైన పునాదులుగా నిలిచాయి.దామోదరం సంజీవయ్య ఆశీస్సులతో 1971లో ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అదే సమయంలో మా నాన్నగారు మండలి వెంకటకృష్ణారావు కూడా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అప్పటినుంచి వారిద్దరి మధ్య ఏర్పడిన పరిచయం జీవితాంతం కొనసాగిన ఆత్మీయ స్నేహంగా పరిణమించింది. నాకు కూడా అప్పటి నుంచే చక్రపాణిగారితో పరిచయం.1976లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన చక్రపాణి 1985 వరకు వివిధ బాధ్యతలు నిర్వహించారు. చీఫ్ విప్‌గా, ప్రివిలేజెస్ కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, పిటిషన్ల కమిటీ, హౌస్ కమిటీ వంటి కీలక కమిటీలకు అధ్యక్షత వహించారు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ శాసనమండలిని రద్దు చేయడంతో ఆయన శాసన ప్రస్థానంలో కీలక మలుపు ఏర్పడింది. ఆ సమయంలో ఆయన మండలి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. శాసనమండలి అనేది కేవలం రెండో సభ మాత్రమే కాదని, చట్టాలపై పునరాలోచనకు, వివిధ రంగాల నిపుణుల అభిప్రాయాలకు, ప్రజాసమస్యల లోతైన పరిశీలనకు అవసరమైన ప్రజాస్వామ్య వేదిక అని చక్రపాణి బలంగా విశ్వసించేవారు.దాదాపు 22 ఏళ్ల విరామం తరువాత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ శాసనమండలిని పునరుద్ధరించారు. 2007 ఏప్రిల్ 2న పునరుద్ధరణ అనంతర మండలి తొలి చైర్మన్‌గా చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన అదే మండలికి, పునరుద్ధరణ అనంతరం తొలి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆయన జీవితంలో ఒక విశిష్టమైన చారిత్రక ఘట్టం.జాతీయ స్థాయిలోనూ ఆయన పార్లమెంటరీ సేవలు విస్తరించాయి. ఆల్ ఇండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ సమావేశం స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా, స్పీకర్స్ కాన్ఫరెన్స్ సబ్ కమిటీ కన్వీనర్‌గా, పార్లమెంటరీ కమిటీల అధ్యయనానికి సంబంధించిన జాతీయ స్థాయి ఉపసంఘానికి కన్వీనర్‌గా పనిచేశారు. కామన్‌వెల్త్ పార్లమెంటరీ సమావేశాల్లో పాల్గొని వివిధ దేశాల శాసన వ్యవస్థలను అధ్యయనం చేశారు. ప్రజాస్వామ్య సంస్థల పనితీరుపై ఆయనకున్న ఆసక్తికి ఈ బాధ్యతలు నిదర్శనం.చక్రపాణిలోని మరో విశిష్టమైన కోణం ఆయన రచనా వ్యాసంగం. అనే గ్రంథం ద్వారా శాసనమండలి ఆవశ్యకతను విశ్లేషించారు.పుస్తకాల ఆవిష్కరణ ఇటీవలే వారి స్వగృహంలో నా చేతులమీదుగా జరిగింది.చక్రపాణిగారి వ్యక్తిత్వంలో నాకు విశేషంగా గుర్తుండిపోయే అంశం తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల పట్ల ఆయనకున్న అపారమైన అభిమానం. 'ఆంధ్ర జనత' తెలుగు దినపత్రికకు సంపాదకుడిగా పనిచేశారు. తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా సాధనకు జరిగిన కృషిలో చురుకుగా భాగస్వాములయ్యారు. 2011లో మారిషస్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో, 2012లో ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచ తెలుగు చరిత్ర మహాసభల్లో మేమిద్దరం పాల్గొన్నాము. శాసనమండలి చైర్మన్‌గా ఉన్న సమయంలో రాష్ట్రేతర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగువారి విద్యా, సాంస్కృతిక సమస్యల పరిష్కారానికి ఆయన ప్రత్యేక చొరవ చూపారు.చక్రపాణిగారితో నాకున్న అనుబంధం రాజకీయ సంబంధాలకు అతీతమైనది. శాసనమండలి చైర్మన్‌గా ఉన్నప్పుడు, నేను మంత్రిగా, శాసనసభ ఉపసభాపతిగా పనిచేసిన సందర్భాల్లో ఆయన సలహాలు, సూచనలు, ప్రోత్సాహం పొందే అవకాశం లభించింది. తెలుగు భాష, చరిత్ర, సంస్కృతి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారి సమస్యలపై ఆయనతో జరిగిన చర్చలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. పదవులు మారినా, రాజకీయ పరిస్థితులు మారినా ఆత్మీయ సంబంధాలకు ఆయన ఇచ్చిన విలువ ప్రత్యేకమైనది.83 సంవత్సరాల వయసులో మొన్న నవంబర్ 4న చక్రపాణి అస్తమించారు. మా కుటుంబానికి ఆత్మీయ మిత్రుడిగా, ప్రజాజీవితంలో సహచరుడిగా, శాసన వ్యవస్థలో అనుభవజ్ఞుడైన మార్గదర్శిగా ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ పదిలంగా ఉంటాయి.

# అభివృద్ధికి దక్కిన ఆమోదం ఈ విజయం

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ప్రజా మద్దతు లభించలేదని వివరించారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర అభివృద్ధి, సుపరిపాలన కోసం కృషి చేశామని, విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని పునరుద్ధరించేలా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించామని గుర్తు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజాదరణ మరింత పెరిగిందని ఓట్ల శాతం స్పష్టం చేస్తోందని తెలుగుదేశం అధినేత చంద్రబాబు తెలిపారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లు సాధించిందని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఆదరణ పెరిగిందని వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైఎస్సార్సీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణాల్లో ఎన్డీఏకు 59.9 శాతం, వైఎస్సార్సీపీకి 34.3 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా ఉందని వివరించారు.జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ 57.6 శాతం, వైఎస్సార్సీపీ 39.7 శాతం ఓట్లు సాధించాయని, కూటమి స్ట్రైక్ రేట్ 87.5 శాతంగా నమోదైందని సీఎం చంద్రబాబు తెలిపారు. పట్టణాల్లో కూటమి, వైఎస్సార్సీపీ మధ్య ఓట్ల శాతం వ్యత్యాసం 25.60 శాతం కాగా గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందన్నారు. మొత్తం 9,818 ఎంపీటీసీ స్థానాలకు గానూ కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను దక్కించుకుందని వెల్లడించారు.పట్టణాల్లో ఎన్డీఏకు 65.7 శాతం, వైఎస్సార్సీపీకి 27.42 శాతం పోస్టల్ బ్యాలెట్లు రాగా, పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైఎస్సార్సీపీకి 31.46 శాతం వచ్చాయని వివరించారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గానూ కూటమి 575 స్థానాలను గెలుచుకుందని, 28 జిల్లాలకు 27 జిల్లాల్లో ఆధిక్యత సాధించిందని చంద్రబాబు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైఎస్సార్సీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుందని, ఏడు జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని వివరించారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీ ఖాతా తెరవలేదని వెల్లడించారు. పెట్టుబడులను ఆకర్షించేలా ఎస్ఐపీబీ, కేబినెట్ సమావేశాల ద్వారా వేగంగా అనుమతులు ఇచ్చామని, వివిధ శాఖల ప్రగతి నివేదికలను కూడా ప్రజల ముందు ఉంచామని సీఎం చంద్రబాబు తెలిపారు. రాయలసీమను అభివృద్ధి సీమగా మార్చేలా నీటిని అందించడంతో పాటు పరిశ్రమలను తీసుకొచ్చామని, సూపర్ ఎల్‌నినో వంటి తీవ్ర కరవు పరిస్థితుల్లోనూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో కరవుతో పాటు కోస్తాంధ్రలో తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురైనా, సాంకేతికత సాయంతో ముందస్తు అంచనాలు వేసి హెచ్చరికలు జారీ చేశామని వివరించారు. " స్థానిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు అండగా నిలిచాం. అందుకే ఎన్నికల్లో ప్రజలు కూటమికి అండగా నిలిచారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా కూటమికి ప్రజలు మద్దతు పలికారు. అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన గౌరవమే ఈ ఎన్నికల ఫలితాలు. ఉద్యోగులు కూడా కూటమి వైపే ఉన్నారనడానికి పోస్టల్ బ్యాలెట్ ఫలితాలే నిదర్శనం. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కూటమికి ప్రజాదరణ పెరిగిందని ఓట్ల శాతం స్పష్టం చేస్తోంది. కూటమికి మూడున్నర శాతం ఓట్లు పెరగ్గా వైఎస్సార్సీపీకి ఆరున్నర శాతం ఓట్లు తగ్గాయి. రెండున్నరేళ్ల పాలన తర్వాత ప్రజల స్పందనకు ఈ ఫలితాలు నిదర్శనం. మంచి రాజకీయాలు సుపరిపాలనకు నాంది పలుకుతాయన్న నమ్మకం మరోసారి రుజువైంది.

## పంచాతీయ ఎన్నికల వరకు ఏపీ గ్రామీణ ప్రాంతాల్లో కోడ్ కొనసాగింపు

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఎత్తివేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ కీలక దశకు చేరుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పట్టణ పరిధిలో ఎన్నికల కోడ్ తొలగింపునకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో, పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ కొనసాగించాలని నిర్ణయించారు.రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా ముగిసింది. వీటికి తోడు మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల ప్రక్రియ కూడా శనివారంతో పూర్తయింది. ఈ పరిణామాల నేపథ్యంలో, రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్‌ను తొలగిస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు నవంబర్ 7 రాత్రి 10 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ఎస్ఈసీ స్పష్టం చేసింది.అయితే, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం ఎన్నికల ప్రవర్తనా నియమావళి యథావిధిగా అమలులో ఉంటుందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఎన్నికల ప్రక్రియ జరగాల్సి ఉండడమే ఇందుకు కారణం. గ్రామ పంచాయతీల ఎన్నికలు సంపూర్ణంగా ముగిసేవరకు గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల నిబంధనలు, ఆంక్షలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో సాధారణ పరిపాలనా వ్యవహారాలు, స్థానిక అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా తిరిగి ప్రారంభం కానున్నాయి. నిలిచిపోయిన పౌర సేవల కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు అధికారులకు వెసులుబాటు లభించింది. అదే సమయంలో, గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మాత్రం పాలనా యంత్రాంగం, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని ఎస్ఈసీ స్పష్టం చేసింది.ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13,219 నుంచి 13,354 పంచాయతీలకు మూడు విడతల్లో పోలింగ్, కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక ఎన్నికల షెడ్యూల్‌ను 2026 నవంబర్ 13న విడుదల చేసే అవకాశముంది.



# ఒక్క ఏడాదిలో 300పైగా ఉగ్రవాదులు అరెస్టు

**మొదటిపేజీ తరువాయి -**

పేలుడుతో ఇలాంటి దాడులను నివారించడానికి కేంద్ర నిఘా సంస్థలు ఒక విధానాన్ని రూపొందించాయి. ఈ ఆలోచనతోనే ఫిబ్రవరి 23న 'ప్రహార్: జాతీయ ఉగ్రవాద నిరోధక విధానం, వ్యూహం' విధానాన్ని ప్రవేశపెట్టింది. ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్? విధానాన్ని ఉంటుందని 2026 సెప్టెంబర్?లో జరిగిన రాష్ట్ర డీజీపీలు, కేంద్ర ఏజెన్సీ అధిపతుల ఉన్నత స్థాయి సమావేశంలో స్పష్టం చేసింది. ఈ 'ప్రహార్' వ్యూహంలో భాగంగానే పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న 'షహజాద్ భట్టి నెట్‌వర్క్'పై దేశవ్యాప్తంగా దాడులు చేసి 100కు పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దాదాపు 300 మందికి పైగా కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ గుర్తులు ఉన్న హ్యాండ్ గ్రెనేడ్‌లు, అక్రమ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. అనంతరం సెప్టెంబర్ 26న చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద ఎస్‌బీఎన్‌ను ఉగ్రవాద సంస్థగా కేంద్రం ప్రకటించింది. అటు ఉగ్రవాదులకు విదేశీ ఆశ్రయాలు లభించకుండా దౌత్యపరమైన చర్యలను కేంద్రం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రత్యేక 'ఎక్స్‌ట్రాడిషన్ పోర్టల్'ను ప్రారంభించింది. దీనివల్ల గడిచిన ఏడాది కాలంలో విదేశాల నుంచి 73 మంది కీలక ఉగ్రవాదులను భారత్‌కు రప్పించగలిగారు. మరోవైపు బాంబుల తయారీకి వాడే అమ్మోనియం నైట్రేట్ అమ్మకాలపై ఇప్పుడు ఆకస్మిక తనిఖీలు నిరంతరం జరుగుతున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. యువతలో వచ్చే ఉగ్ర ఆలోచనల ప్రవర్తన మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపాయి. "ఎర్రకోట పేలుడు కేసు ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇందులో అత్యంత అర్హత కలిగిన నిపుణులు పాలుపంచుకున్నారు. ఇప్పుడు అమ్మోనియం నైట్రేట్, ఇతర పదార్థాల అమ్మకాలపై ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలతో సహా అనేక నిబంధనలు అమల్లో ఉన్నాయి." అని ఓ అధికారి తెలిపారు.అదే సమయంలో కేంద్ర భద్రతా సంస్థలు అనేక ఆపరేషన్లు చేపట్టి తీవ్రవాద మాడ్యూళ్లను విజయవంతంగా నిర్మూలించాయి. జైష్-ఎ-మొహమ్మద్, లష్కర్-ఎ-తైబా వంటి నిషేధిత సంస్థల మద్దతు వ్యవస్థలను దెబ్బతీశాయి. ఖలిస్థాన్ అనుకూల శక్తులపై తీసుకున్న చర్యలు, బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఖలిస్థాన్ జిందాబాద్ ఫోర్స్ వంటి సంస్థల నెట్‌వర్క్ వ్యూహాలను నిర్వీర్యం చేశాయి. దీనివల్ల సరిహద్దుల గుండా జరిగే ఆయుధాల స్మగ్లింగ్‌కు అంతరాయం కలగడంతో పాటు, కీలకమైన వ్యక్తులను అరెస్టు చేశాయి. బంగ్లాదేశ్ కేంద్రంగా ఉన్న ఉగ్రవాద ముప్పుల నివారణను కూడా ముమ్మరం చేశాయి. అసోం, బెంగాల్, త్రిపుర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్ భావజాలంతో ప్రేరణ పొందిన 27 మంది తీవ్రవాద కార్యకర్తలను అరెస్టు చేశాయి.2025 నవంబరు 10న దిల్లీలోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. ఈ కేసులో ఎన్ఐఏ 7500 పేజీల ఛార్జ్‌షీట్‌ను దిల్లీ కోర్టుకు సమర్పించింది. ప్రధాన సూత్రధారి ఉమర్ ఉన్ నబీతో (పేలుడులో అతడు మరణించాడు) పాటు మొత్తం 10 మందిని నిందితులుగా చేర్చింది. దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీలో ఎన్ఐఏ సోదాలు జరిపి 588 మంది నుంచి వాంగ్మూలాలు నమోదు చేసింది. 395కు పైగా పత్రాలు, 200కు పైగా స్వాధీనం చేసుకున్న పరికరాల నుంచి సాక్ష్యాలు సేకరించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ పేలుడు వెనుక జిహాదీ కుట్ర కోణం ఉన్నట్లు ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలు స్పష్టంచేశాయని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది.

## లోకేశ్ ఆదేశాలతోనే తప్పుడు కేసులు

**మొదటిపేజీ తరువాయి -** ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం జైలు వెలుపల అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు.ప్రశాంతంగా ఉండే గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం దుష్ట సంప్రదాయాలకు తెరతీసిందని అంబటి విమర్శించారు. "ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత బస్సులో నుంచి వెంగళాయపాలెం బ్యాలెట్ బాక్స్‌ను కిందకు ఎందుకు దించారు? ఓ చిన్న ఘటనను అడ్డంపెట్టుకుని కేసు నమోదు చేయడం అత్యంత దుర్మార్గం. ఎలాగైనా సరే అప్పిరెడ్డిని జైల్లో పెట్టాలనే ఉద్దేశంతో లోకేశ్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కుట్ర పన్నారు" అని అంబటి ఆరోపించారు.చురుగ్గా పనిచేస్తున్న వైసీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని జైళ్లకు పంపే కుట్రలు జరుగుతున్నాయని, అయితే ఇలాంటి చర్యలకు పార్టీ నేతలు ఎవరూ భయపడబోరని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్సు తరలింపు వివాదంలో విధుల నిర్వహణకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో నవంబర్ 6న పోలీసులు అప్పిరెడ్డిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## అమ్మవారి నాణెం కోసం చార్మినార్ వద్ద పోటెత్తిన భక్తులు

**మొదటిపేజీ తరువాయి -** దీపావళి పండగ సందర్భంగా చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవారి ఖజానా నుంచి నాణేల పంపిణీ ప్రారంభం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆదివారం సాయంత్రం మొదలైన ఈ పంపిణీ కోసం భక్తులు బారులు తీరారు. గుల్జార్ హౌస్ వరకు క్యూలైన్లు విస్తరించాయి.భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ నిర్వాహకులు నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నాణేలు పంపిణీ చేస్తున్నారు. అమ్మవారి ఖజానా నుంచి లభించే నాణెం ఇంటికి తీసుకెళ్తే శుభాలు కలుగుతాయని, సిరిసంపదలు పెరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ నమ్మకంతో ప్రతి ఏటా దీపావళి సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో వస్తుంటారు.మూడు రోజుల పాటు అమ్మవారి ఖజానా నుంచి నాణేల పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది. దీంతో రానున్న రెండు రోజుల్లోనూ ఆలయానికి భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉంది.

# తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది.రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికారులు స్పందించారు. బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు.కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశపూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

## శాంతియుత పరిష్కారాలకు అన్ని విధాలుగా భారత్ సిద్ధం

**మొదటిపేజీ తరువాయి -** సంక్లిష్టతలు కొనసాగుతున్న వేళ జెలెన్స్కీతో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సంభాషణలో ఘర్షణలకు సంబంధించి ప్రస్తుత పరిణామాలను మోదీకి జెలెన్స్కీ వివరించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. యుద్ధాన్ని చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే పరిష్కరించుకోవాలనే భారతదేశపు స్థిరమైన వైఖరిని జెలెన్స్కీకి మోదీ గుర్తుచేసినట్లు పేర్కొంది. యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనే దిశగా సాగే అన్ని రకాల ప్రయత్నాలకు భారత్ మద్దతిస్తుందని మోదీ హామీ ఇచ్చినట్లు తెలిపింది. ఈ సంభాషణలో వివిధ రంగాల్లో భారత్-ఉక్రెయిన్ ప్రజల ఉమ్మడి ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరు నేతలు చర్చించినట్లు తెలిపింది.

## తెలంగాణ జిల్లాల్లో పూర్తి వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి -** ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక వసతుల లోపాలు, సిబ్బంది కొరత వంటి సమస్యలను జిల్లా స్థాయిలోనే ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు.వైద్య సేవల విస్తరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకాలతో పాటు అవసరమైన నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల నియామక ప్రక్రియను ప్రభుత్వం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు నాణ్యమైన చికిత్సను చేరువ చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిస్తేనే అభివృద్ధి సాధ్యం

**మొదటిపేజీ తరువాయి -** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో కలిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. నగరంలో ప్రధాన సమస్యగా మారిన డంప్ యార్డ్ అంశాన్ని త్వరలోనే పరిష్కరిస్తామని, దీనిపై ఎవరూ అనవసర వివాదాలు చేయవద్దని సూచించారు. అభివృద్ధి పనులకు కొందరు కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంట్రాక్టర్లను భయపెడితే పనులు కావని, కరీంనగర్ పేరును సర్వనాశనం చేయాలని చూసే నీచ రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. చిల్లర వేషాలు వేస్తే ప్రజలు ఊరుకోరని, పనులను అడ్డుకుంటే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ డంప్ యార్డ్ సమస్య ఇప్పటిది కాదని, దీని పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. తమకు ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత ప్రజా సంక్షేమమే ముఖ్యమని పేర్కొన్నారు. దీంతో పాటు సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ం

## పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారు



**మొదటిపేజీ తరువాయి -** ఖండించారు. పార్టీ కార్యకర్త అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళుతున్న నాయకుడిని పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు పట్నం నరేందర్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకుని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోస్గిలో మరణించిన ఓ బీఆర్ఎస్ కార్యకర్త అంత్యక్రియలకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నందున, ముందస్తు జాగ్రత్త చర్యగానే నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఆగ్రహించిన బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసు వాహనాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కేటీఆర్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "పరామర్శించేందుకు వెళుతున్న నాయకుడిని అరెస్టు చేయాల్సిన అవసరం ఏముంది? బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా? నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే కాంగ్రెస్ పార్టీ పాలనగా మార్చుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదు. ప్రజల, కార్యకర్తల పక్షాన పోరాటం కొనసాగుతుంది. పట్నం నరేందర్‌రెడ్డిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.మరోవైపు, పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఖండించారు. ప్రతిపక్ష నేతలను అకారణంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

# తమిళనాడులో ఎస్సైని కొట్టి చంపిన యువకులు

**రూ.40 లక్షలు పరిహారం ప్రకటించిన సీఎం విజయ్**

**తేని జిల్లాలో విధుల్లో ఉన్న ఎస్సై సెంథిల్ కుమార్‌పై మద్యం మత్తులో ఉన్న యువకుల దాడి**

**ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ రోడ్డుపై రీల్స్ చేస్తుండగా అడ్డుకున్నందుకు ఘాతుకం**

**నిందితుల్లో నలుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు**

**ఎస్సై కుటుంబానికి ఆర్థిక సాయం ప్రకటించిన తమిళనాడు సీఎం విజయ్**



తమిళనాడులోని తేని జిల్లాలో విధి నిర్వహణలో ఉన్న స్పెషల్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) సెంథిల్ కుమార్ దారుణ హత్యకు గురికావడం తీవ్ర కలకలం రేపింది. దీపావళి వేడుకల సమయంలో మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు చేసిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఆయన కుటుంబానికి తమిళనాడు ప్రభుత్వం రూ.40 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది.ఈ విషాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు మరియు సహచర పోలీసు సిబ్బందికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అధికారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.తేని జిల్లాలోని సమాధర్మపురం ప్రాంతంలో ఆదివారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానిక యువకులు కొందరు ప్రధాన రహదారిని అడ్డుకుని, విచ్చలవిడిగా బాణసంచా కాలుస్తూ సోషల్ మీడియా రీల్స్ చిత్రీకరిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే పాదచారులకు, వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎస్సై సెంథిల్ కుమార్ ఆ దృశ్యాన్ని గమనించి వెంటనే జోక్యం చేసుకున్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా పండుగ జరుపుకోవాలని ఆ యువకులకు సూచించారు.అయితే, సెంథిల్ కుమార్ హెచ్చరికలను ఆ యువకులు ఏమాత్రం పట్టించుకోలేదు. మరింత నిర్లక్ష్యంగా రోడ్డుపైనే టపాసులు కాలుస్తూ రచ్చ కొనసాగించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న విషయాన్ని డాక్యుమెంట్ చేసేందుకు సెంథిల్ కుమార్ తన మొబైల్ ఫోన్‌లో వారి చర్యలను వీడియో తీయడం ప్రారంభించారు. ఇది చూసి ఆగ్రహానికి గురైన ఆ యువకులు ఒక్కసారిగా ఆయనపై దాడికి తెగబడ్డారు. మద్యం, ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో ఉన్న ఆ ముఠా ఎస్సైపై తీవ్రస్థాయిలో దాడి చేసింది.ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సెంథిల్ కుమార్ ఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే ఆయనను సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న వెంటనే తేని ఎస్పీ ప్రవీణ్ గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తును పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ఆధారాలు సేకరించారు.ఈ కేసులో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ దాడిలో ఇంకా ఎవరైనా పాల్గొన్నారా అనే కోణంలో పోలీసులు విస్తృతంగా విచారణ జరుపుతున్నారు. పండుగ పూట శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీస్ అధికారినే అత్యంత దారుణంగా కొట్టి చంపడం స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది.

### విలువైన వస్తువుల బ్యాగు తిరిగి

# పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్

**ఆటో డ్రైవర్లను అభినందించిన సీఐ సిహెచ్ ఎల్లయ్య**



**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ) :** అశ్వాపురం మండల కేంద్రంలో మణుగూరు మండలంకు చెందిన ఆదిత్య విలువైన వస్తువులతో కూడిన బ్యాగును, ప్రయాణికుడు ప్రయాణించిన ఆటోలో మర్చిపోయాడు. ఈ విషయాన్ని గుర్తించిన అశ్వాపురం స్థానిక ఆటో డ్రైవర్లు బ్యాగును భద్రంగా తీసుకొని ఆదివారం నాడు అశ్వాపురం పోలీస్ స్టేషన్లో సీఐ సీహెచ్ ఎల్లయ్యకి అప్పగించారు. అనంతరం సీఐ ఎల్లయ్య బ్యాగును మణుగూరుకు చెందిన ఆదిత్యకు తిరిగి అందజేశారు. తమకు దొరికిన విలువైన వస్తువుల బ్యాగును సొంతం చేసుకోకుండా,బాధ్యతాయుతంగా పోలీసులకు అప్పగించి యజమానికి చేరేలా చేసిన ఆటో డ్రైవర్ల నిజాయితీని, సీఐ ఎల్లయ్య, అభినందించారు. ఆటో డ్రైవర్లు తమ నిజాయితీతో మానవత్వాన్ని చాటుకున్నారని, పోలీస్ సిబ్బంది పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి ఆటో డ్రైవర్లు బోళ్ల రమణయ్య, ఎస్.కె నాగుల్ మీరా, కోర్స వెంకటేశ్వర్లు, బాల శ్రీను, కొమ్ము రాంబాబు, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు స్వీకరణ

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించిన ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి**





**వలిగొండ, నవంబర్ 09 ( తొలివార్త ) :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు హాజరై తమ సమస్యలు, ఫిర్యాదులను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం రెండు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజల నుంచి దరఖాస్తులు, ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. అనంతరం ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి మండలంలోని అక్కంపల్లి, ఎడుల్లగూడెం, ప్రొద్దటూరు, టేకులసోమారం, దాసిరెడ్డిగూడెం గ్రామాలను సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం నిర్దేశించిన కొలతలు, నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్లు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు నవీకరించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత కొలతల ప్రకారం నిర్ణీత సమయంలో పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులు పత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ జి. జలంధర్ రెడ్డి సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ని ఆకస్మిక తనిఖీ చేసిన

**జిల్లా కలెక్టర్ అంకిత్**





**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు నవంబర్ 09 ( తొలివార్త ) :** జిల్లా కలెక్టర్ బూర్గంపాడు ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఉదయం హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్న కలెక్టర్, ల్యాబ్, ఓపీ విభాగం, మందుల స్టాక్, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్లను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పాటించాలని, వచ్చే రోగుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రికార్డుల నిర్వహణ, ల్యాబ్ పరీక్షల తీరును కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రి సిబ్బందిలో కాస్త ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలను మరింత మెరుగుపరిచేందుకే ఈ తనిఖీలు చేపడుతున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాటు ఆసుపత్రి సూపరింటెండ్ ప్రసాద్, డాక్టర్ అమరేందర్ రెడ్డి మరియు కొందరు డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి పండగ రోజున విషాదం...

**మృతి చెందిన 18 ఏళ్ల గిరీష్**

**తల్లిదండ్రులకి తీరని బాధ, కడుపు కోత**




**భద్రాద్రి జిల్లా బూర్గంపాడు నవంబర్ 09 ( తొలివార్త ) :** బూర్గంపాడు మండల కేంద్రమైన గౌతమీపురం గ్రామంలో గిరీష్ (18 ) అనే యువకుడు ఉరి వేసుకొని మృతి చెందాడు. ఊరంతా దీపాలతో, టపాసుల శబ్దాలతో, నవ్వులతో నిండిన రోజు దీపావళి. కానీ బూర్గంపాడు గ్రామంలో ఒక ఇంట్లో మాత్రం ఆ రోజు వెలుగులు ఆరిపోయాయి. అందరితో కలిసి కొత్త బట్టలు వేసుకుని, స్నేహితులతో సరదాగా గడపాల్సిన 18 ఏళ్ల గిరీష్ ఎవరికీ చెప్పలేని బాధతో తిరిగిరాని లోకానికి వెళ్లిపోయాడు. 18 ఏళ్లు అంటే... కలలు కనే వయసు. జీవితాన్ని మొదలు పెట్టే వయసు. ఆ చిన్న వయసులో అంత పెద్ద నిర్ణయం తీసుకునేంత ఒత్తిడి అతనిలో ఎలా వచ్చింది. ఒక కొడుకును పోగొట్టుకున్న తల్లిదండ్రుల ఆవేదనను మాటల్లో చెప్పలేం. నిన్నటి వరకు కళ్ల ముందు తిరిగిన బిడ్డ, ఈ రోజు ఫోటోలో మిగిలిపోవడం అంతకంటే పెద్ద శిక్ష ఏ తల్లిదండ్రులకు ఉండదు. ఈ మరణం మనందరికీ ఒక చెంపపెట్టు. మన పక్కనే ఉన్న మన ఫ్రెండ్స్, మన తమ్ముళ్లు నవ్వుతూ కనిపించినా, లోపల ఎంతో బాధను దాచుకుంటున్నారు అనేది గమనించాలి.

### మండల వ్యాప్తంగా ఘనంగా

# ఇందిరమ్మ నూతన గృహాల్లో దీపావళి సంబరాలు





**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ) :** అశ్వాపురం మండలంలో ఘనంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి మహోత్సవం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు,ఆదివారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని, ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి మహోత్సవ కార్యక్రమాన్ని అశ్వాపురం మండలంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్ల యజమానులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఓరుగంటి భిక్షమయ్య, మరియు చింతపల్లి మాధవి సాధనాల పద్మజ బై రోజు స్వరూప సిలివేరి అనసూయ, వీరందరూ మరియు మండలం వ్యాప్తంగా నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాల వద్ద దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లలో వెలుగులు నింపుతూ, పేద కుటుంబాల్లో ఆనందాన్ని పంచుతూ, ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరిసేలా దీపావళి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ, అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా సీనియర్ నాయకులు,గాదే కేశవరెడ్డి, వరలక్ష్మి కన్నెక్షన్ అధినేత వేములపల్లి రమేష్ బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాక రాములు, నాయకులు ఆవుల రవి తూము పెద్ద వీరరాఘవులు, చెంచాల రాము బారాసు సంపత్, మాజీ సర్పంచ్ బట్ట సత్యనారాయణ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు వెలకట్టలేనిది సిపిఐ ఎంఎల్ మాస్ లైన్

**కొనిజర్ల నవంబర్ 09 ( తొలివార్త ) :** తీగల బంజారా మరియు సింగరాయపాలెం గ్రామంలో అమరవీరుల స్థూపాల దగ్గర సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అరుణ పథకాలలో తీగల బంజర లో ధర్మసోత్ రాప్సు ఎగరవేయడం జరిగింది. సింగరాయపాలెం లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ అరుణ పథకాన్ని కంకణాల చిన్న వెంకటి ఎగరవేయడం జరిగింది. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ నాయకులు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ ఎంఎల్ మా ఫ్రెండ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామయ్య మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజలందరూ సమానత్వంతో జీవించాలని కలలుగంటూ దోపిడీ వ్యవస్థను కోలకొట్టుడుకు పోరాడి పాలకుల పోలీస్ కాల్పులు అసువులు బాసిన అమరవీరులకు ముందుగా విప్లవ జోహార్లు తెలిపారు. కొణిజర్ల మండలంలోని ఏ ఆధారం లేని పేద ప్రజలందరిని ప్రజాప్రత ఆధ్వర్యంలో ఐక్యత చేసి విక్రం నగర్ ఎల్లన్న నగర్ జంపాలనగర్ క్రాంతి నగర్ రామనర్సయ్య నగర్ గ్రామాలను నిర్మించి పోడు భూములు నరికించి పేద ప్రజలకు పంచన చరిత్ర సిపిఐ ఎంఎల్ ప్రజాప్రతాకే ఉంది. ఫారెస్ట్ పోలీస్ పెత్తల దారి




దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను చెక్కుచెదరకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటూ ఒకనాటి ఏమే ఒరేయ్ ఒసేయ్ అనే పేద ప్రజలను బలహీనంగా చూసే సంస్కృతిని వ్యతిరేకంగా విప్లవ సంస్కృతిని ఈ ఏరియాలో పునాది వేశారు. కుల మతాలు లేని అన్న అక్క అని పిలుచుకునే గ్రామంలో ఒకే తాటిమీద ఉండి తాతలు తండ్రులు ఎవరు వీరికి భూమి ఇవ్వకపోయినా సిపిఐ ఎంఎల్ ప్రజాపంతా ఆధ్వర్యంలో కుటుంబానికి 5 ఎకరాల నుంచి పది ఎకరాలు కొట్టుకొని వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ మంచి భవిష్యత్తును తీర్చుదిద్దుకుంటూ ఈ ప్రాంతంలో ప్రజలు ఆనందంగా జీవించిన రోజులు పోట్ల రామ నరసయ్య దివి కృష్ణ రాయల సుభాష్ చంద్రబోస్ రాయల చంద్రశేఖర్ పొట్లపల్లి శ్రీశైలం వల్లూరి వెంకయ్య ఎంతో మంది అమరవీరుడు ఈ గ్రామాల నిర్మాణాల కోసం ఎన్నో నిర్బంధాలను ఫారెస్ట్ పోలీస్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడి తమ అమూల్యమైన వంటి ప్రాణాలను ఇచ్చినటువంటి చరిత్ర ఉన్నది. అలాంటి అమరవీరుల త్యాగాలు మరో కొండ వారి నడవడికలో నడవడమే మనం వారికి ఇచ్చేటువంటి నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ లాల్మియా మేడికొండలరావు కంకణాల పెద్ద వెంకటి తుడుం తలపాలు కంకణాల చిన్న వెంకటి బాబు చిన్న శ్రీను సర్పంచ్ ముత్తనబోయిన లెనిన్ రాపోలు కృష్ణ గండికోట బాబు గూగుల్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో

**ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు**





**మణుగూరు నవంబర్ 09 ( తొలివార్త ) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను పినపాక నియోజకవర్గంలోని మణుగూరు పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే,ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు, భారీ ఎత్తున ఎత్తున కేక్ కట్ చేసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్,రెడ్డి,కి,జన్మదిన,శుభాకాంక్షలు,తెలియజేశారు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కేకు, తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజాపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చాలని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ అధ్యక్షులు మహిళా నాయకురాలు,ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల మధ్య దీపావళి పండుగ సందడి నెలకొంది. పాల్గొన్న ఎమ్మెల్యే





**భువనగిరి నవంబర్ 09 ( తొలివార్త ) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని 22, 28, 15, 16వ వార్డుల్లో నిర్వహించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని, లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ సంబరాల్లో పాలుపంచుకున్నారు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో, గుడిసెల్లో నివసిస్తూ ఇబ్బందులు పడిన నిరుపేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించడం ఎంతో సంతోషకరమన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడల సముదాయం మాత్రమే కాదని, అది ఒక కుటుంబ ఆత్మగౌరవానికి, భద్రతకు, భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలను చేపడుతోందని తెలిపారు. ఇప్పటికే 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన నేపథ్యంలో, లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి దీపావళి వేడుకలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేదవాడి సొంతింటి కల నెరవేరినప్పుడే ఆ కుటుంబంలో నిజమైన దీపావళి వెలుగులు విరజిమ్ముతాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించి, వారి జీవితాల్లో భరోసా, భద్రత, ఆత్మగౌరవాన్ని నింపాలన్నదే ప్రభుత్వ సంకల్పమని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కూర వెంకటేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక కౌన్సిలర్లు జాలిగం విఘ్నేష్, సుదగాని సరిత, నజియా రెహ్మాన్, భోజన శారద, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి. తాజుద్దీన్, కోఆప్షన్ సభ్యుడు బడుగు శంకర్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నేతృత్వంలో

**ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు పాల్గొన్న పార్టీ శ్రేణులు**



**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ) :** భద్రాచలం పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు యువజన నాయకులతో కలిసి, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాప్రతినిధులకు పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కేకు తినిపించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.శ్రీ సీతారామచంద్రస్వామి వారి దివ్య ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు మరియు పలువురు అభిమానులు పాల్గొని ముఖ్యమంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# పట్టించుకోని 18 వ కౌన్సిలర్ శ్రావణ్ గౌడ్

**పడకేసిన పారిశుధ్యం**

**మురికి కాలువల వెంట ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు**

**దోమల స్వైర విహారం**

**వార్డులో దోమలు, పాముల కారణంగా భయం భయంగా బ్రతుకుతున్న ప్రజలు**

**వార్డులోని కాలనీ గుండా ప్రవహించే నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్**

**చెత్తాచెదారంతో, పిచ్చి మొక్కలతో నిండిపోయి పాములకు**

**దోమలకు నిలయంగా మారింది**

**వార్డులోని సగం ఇండ్లకు త్రాగునీటి కష్టాలు పట్టించుకోని కౌన్సిలర్**



**నిజామాబాద్ జిల్లా: ఆర్మూర్, నవంబర్ 09 ( తొలివార్త ) :** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డు కౌన్సిలర్ ప్రజల చేత ఎన్నుకోబడిన శ్రావణ్ గౌడ్ తన వార్డు పరిధిలోని ప్రజలను ప్రజా సమస్యలను వార్డు అభివృద్ధికి పట్టించుకోవడంలేదని స్థానిక 18 వ వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తొలి వార్త పత్రికా ప్రతినిధి స్థానిక వార్డులోని ప్రజలతో వార్డు సమస్యలపై సమీక్ష నిర్వహించగా మహిళలు వార్డు ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వార్డు ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం వార్డు కౌన్సిలర్ శ్రావణ్ గౌడ్ ప్రజలని పట్టించుకోవడంలేదని, ప్రజల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని, ఒక బోరు చెడిపోవడం వల్ల త్రాగునీటి కష్టాలతో ఇబ్బందులు పడుతున్నామని ఎన్నిసార్లు తనని కలిసిన బోరు రిపేరు చేయించడం లేదని దుమ్మెత్తి పోశారు. పారిశుద్ధ్య విషయానికి వస్తే మురికి కాలువలు శుభ్రం చేయించడం లేదని, దానివల్ల మురికి పోగుపడి దోమలు విపరీతంగా తయారై తాము అనారోగ్యానికి గురవుతున్నామని కనీసం మురికి కాలువలు కూడా శుభ్రం చేయించడం లేదని మహిళలు తెలిపారు. మురికి కాలువల ఇరు ప్రక్కల ఏపుగా పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు సంచరించడం వల్ల ప్రాణ భయంతో వణికి పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పాములు సంచరిస్తూ ఉండడం వల్ల అక్కడ పాములు విడిచిన కుబుసం ఉండడం విశేషం. 18 వ వార్డు గుండా ప్రవహించే నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ మురికి కాలువగా మారడంతో ఆ కాలువ మొత్తం చెత్తాచెదారంతో పిచ్చి మొక్కలతో అపరిశుభ్రంగా మారిపోయింది. ఆ కాలువను శుభ్రం చేయించకపోవడంతో దోమలు పాములకు నిలయంగా మారింది. వార్డులోని సగం ఇండ్లకు త్రాగునీటి కష్టాలు ఉన్నాయని, మిషన్ భగీరథ నీరు కూడా రావడం లేదని ప్రజలు తమ నిస్సహాయతను తెలిపారు. వార్డులో అక్కడక్కడ మురికి కాలువల అవసరం చాలా ఉంది కానీ 18 వ వార్డు కౌన్సిలర్ శ్రవన్ గౌడ్ పట్టించుకున్న పాపాన పోలేదు. కొత్తగా ఎటువంటి మురికి కాలువ నిర్మాణం చేయలేదు. అర్హులైన పేదలకు ప్రభుత్వ పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు లేదా డబుల్ బెడ్ రూములు అందించడంలో విఫలమయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించడంలో కౌన్సిలర్ తన బాధ్యతలను మరిచారు. వార్డును అభివృద్ధి బాటలో నడిపించే పూర్తి రాజకీయ అధికారాలు మరియు బాధ్యతలు నెరవేర్చని వార్డు కౌన్సిలర్ ఉండడం తమ దౌర్భాగ్యం అని ప్రజలు పేర్కొన్నారు.

# వెంకటాపురం గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టిన

**సర్పంచ్ మడకం మూలమ్మ**

**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ) :** అశ్వాపురం



మండల పరిధిలోని, వెంకటాపురం గ్రామపంచాయతీ లోని



మావుళ్ళవాయి, గ్రామాలలోని పలు ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం మరియు పిచ్చి మొక్కలను తొలగించి పారిశుధ్య పనులు,స్థానిక సర్పంచ్ మడకం మూలమ్మ, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మూలమ్మ,మాట్లాడుతూ, గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంతో పాటు ,ప్రజలకు,ఆరోగ్యకరమైన, వాతావరణాన్ని కల్పించడమే, ప్రాముఖ్యత నా లక్ష్యం అని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి మండల యువజన నాయకులు వార్డు సభ్యులు మడకం శరత్, నాయకులు మడకం బద్రి కట్టం జంపన్న పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ మరియు గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టోర్నమెంట్ విజేతలు జట్లకు కప్‌లు అందజేసిన

## ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ):** భద్రాచలం ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో భద్రాచలం ఐటీడీఏ రోడ్డులోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన 7– ఏ–సైడ్, ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహభరితంగా ముగిసింది.ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో భద్రాచలం జట్టు విజేతగా నిలవగా, డోర్నకల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. అదేవిధంగా మూడవ స్థానంలో భద్రాచలం సీఆర్పీఎఫ్, జట్టు నిలిచింది. విజేత, రన్నరప్, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా,కప్‌లు, అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం, పరస్పర స్నేహభావం, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలను







జీవితంలో భాగం చేసుకోవాలని,పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం రోజున ఈ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్స్ జరగడం ఎంతో సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కి ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టమని, గతంలో ఆయన కూడా ఫుట్‌బాల్ ఆడిన సందర్భాలను మనం చూశామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే మంచి పరిణామమని తెలిపారు. భద్రాచలం ప్రాంతంలో యువతకు క్రీడల పట్ల మరింత ప్రోత్సాహం కల్పించేలా ఇలాంటి టోర్నమెంట్లు భవిష్యత్తులో కూడా నిర్వహించాలని నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో, భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, ఉప సర్పంచ్ రత్నం కవిత, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం రామకాంత్ సరెళ్ళ నరేష్, తిరుపతిరావు,కోటి దుర్గారావు విజయ్, భాను చౌదరి, శ్రీ రాఘవేంద్ర టెక్స్టైల్స్ వస్త్రాల ప్రముఖ వ్యాపారవేత్త మీసాల భాస్కరరావు, భద్రాచలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు యూత్ నాయకులు, మరియు, క్రీడాకారులు, క్రీడ అభిమానులు, పెద్ద సంఖ్యలో యువత తదితరులు పాల్గొన్నారు.

### లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు

# కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన

## ఎమ్మెల్యే ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు

**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ) :** బూర్గంపాడు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు టేకుల చెరువు గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు, కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరి పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ఇళ్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. పేద కుటుంబాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని,పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసిల్దార్ హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షులు పి. సుధాకర్ రెడ్డి, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# AIKS అఖిల భారత జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## కామ్రేడ్ మల్లు నాగార్జున రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు

**నూతనకల్ నవంబర్ 09 ( తొలివార్త ):** నల్లగొండ పట్టణంలో నవంబర్ 15 నుండి 18 వరకు జరిగే 36 వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వెంకపల్లి శిల్పకుంట్లలో 36 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేయడం జరిగింది ఇట్టి రాలే కి ముఖ్య అతిథిగా విచ్చేసిన రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ మల్లు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమెరికాలో కుదుర్చుకున్న స్వేచ్ఛ వ్యాపార ఒప్పందాలు రద్దు చేయాలని స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం రైతులకు మద్దతు







ధర ఇవ్వాలని మద్దతు ధర చట్టం తేవాలని 60 సంవత్సరాల నిండిన ప్రతి రైతుకు నెలకు 6000 పెన్షన్ ఇవ్వాలని సహకార సంఘాలను బలోపేతం చేయాలని కౌలు రైతులను ఆదుకోవాలని తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరం 30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని కార్పొరేట్ వ్యవసాయం రద్దు చేయాలని డిమాండ్ చేశారు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శికందాల శంకర్ రెడ్డి గారు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు గారు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పులుసు సత్యం గారు చిల్పకుంట్ల గ్రామ సర్పంచి అంజపల్లి నరసమ్మ ఉపసర్పంచి సామ సురేందర్ రెడ్డి నూతనకల్ మండల రైతు సంఘం అధ్యక్షులు చూడి మధుసూదన్ రెడ్డి రైతు సంఘం మండల కార్యదర్శి గజ్జల శ్రీనివాస్ రెడ్డి పెద్ద మొత్తంలో రైతులు రైతు కూలీలు ట్రాక్టర్లు డ్రైవర్లు తదితరులుపాల్గొన్నారు

# విజయపురి కాలనీలో కోతుల బెడద

## ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన విజయపురి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు.

### వృద్ధులు, పాఠశాల విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిన కోతులు.



**ఘట్‌కేసర్, నవంబర్ 09 ( తొలివార్త ) :** పోచారం విజయపురి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో పెరిగిపోతున్న కోతుల బెడదను నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయపురి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా కాలనీలో కోతుల సంచారం గణనీయంగా పెరిగిందని, దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కోతులు ఇళ్లలోకి చొరబడి నిత్యావసర వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయని, వీధుల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు కోతుల దాడుల భయంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిల్లలను, వృద్ధులను కోతులు తరుముతూ దాడులకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని కోతుల బెడద నివారణకు సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని, కోతులను సురక్షితంగా పట్టుకుని జనావాసాలకు దూరంగా తరలించేలా చర్యలు చేపట్టాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో విజయపురి కాలనీ ఫ్రెండ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్. భాను కుమార్ గౌడ్, ఆర్. శ్రీధర్, కె. జగదీష్, ఎం. శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ ప్రమాదం లో యువకుడు మృతి

**వనస్థలిపురం నవంబర్ 09 ( తొలివార్త ):** ఫిర్యాధిదారుడు కాట్రోత్ శంకర్, వయస్సు 40 సంవత్సరాలు, నివాసం తుంబాయ్ తాండ, సంస్థన్ నారాయణ్పూర్, ఫిర్యాదు ప్రకారం, ఫిర్యాది కొడుకు అరుణ్, వయస్సు 19 సంవత్సరాలు, వృత్తి విద్యార్థి మరియు సన్నీ ఏ సందీప్, ఇంకా కొంత మంది హయత్నగర్ ఉంటూ రూమ్ కిరాయికి తీసుకొని గవర్నమెంట్ జూనియర్ లో చదువుకుంటున్నారు. తేది 08.11.26 నాడు రాత్రి 7 గంటలకు తన కొడుకు అరుణ్ మరియు సందీప్ ఇద్దరు ఎల్.బి.నగర్ లో బైక్ **TS** 07 **GQ** 8554 పై షాపింగ్ కి వెళ్లి, తిరిగి హయత్నగర్ కి వస్తుండగా నా కొడుకు బైక్ నడుపుతుండంగా, సందీప్ వెనకాల కూర్చున్నాడు. మార్గమాధ్యలో ఆటోనగర్ దగ్గర రాయల్ ఓక్ ముందు రోడ్డు లో అందజా రాత్రి 9.20 గంటలకు స్టీల్ బ్రిడ్జ్ దగ్గర రాగానే మారుతీ షోరూం నుండి ఒక గుర్తు తెలియని ద్విచక్ర వాహనం నిర్లక్ష్యంగా రాగా, దానికి, ఫిర్యాది కొడుకు బైకు తాకి, రైట్ సైడ్ లో వెళ్తున్న ఒక గుర్తు తెలియని బస్సు వెనకాల టైర్ కింద పడగా, ఫిర్యాది కొడుకు అక్కడికక్కడే చనిపోయినాడు, సందీప్ కి స్వల్ప గాయలు అయ్యయి. ఇందులో కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేయడం జరిగింది




## రూ.500 నోట్లను రద్దు చేయాలి..

## పెద్ద నోట్ల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన చంద్రబాబు

**రూ.100, రూ.200 నోట్లను మాత్రమే చలామణిలో ఉంచాలన్న చంద్రబాబు**

**పెద్ద నోట్ల రద్దు, డిజిటల్ లావాదేవీల పెంపుతోనే అవినీతికి అడ్డుకట్ట పడుతుందని స్పష్టీకరణ**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఓట్ల శాతం పెరిగిందని వెల్లడి**

**2024 ఎన్నికల కంటే 3.6 శాతం పెరిగి 58.9 శాతానికి చేరిందన్న సీఎం**

**రాష్ట్రవ్యాప్తంగా 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 575 స్థానాలను కూటమి గెలుచుకుందని వెల్లడి**




100 మున్సిపల్ మేయర్, ఛైర్‌పర్సన్ స్థానాల్లో కూటమి 94 స్థానాలను కైవసం చేసుకుందని వివరణ

దేశంలో రూ.500 నోట్లను రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మరోసారి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో కేవలం రూ.100, రూ.200 విలువ కలిగిన కరెన్సీ నోట్లను మాత్రమే చలామణిలో కొనసాగించాలని ఆయన పేర్కొన్నారు. గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి డిజిటల్ కరెన్సీపై సమర్పించిన నివేదికను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. పెద్ద నోట్లను రద్దు చేయాలనే అంశంపై తాను నిరంతరం మాట్లాడుతుంటానని స్పష్టం చేశారు. “రూ.500, రూ.1,000, రూ.2,000 నోట్లను పూర్తిగా రద్దు చేయాలి. కేవలం రూ.100, రూ.200 నోట్లను మాత్రమే ఉంచాలి” అని ఆయన డిమాండ్ చేశారు. పెద్ద నోట్ల రద్దుతో నగదు వినియోగాన్ని నియంత్రించి, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం ద్వారా అవినీతిని సమర్థవంతంగా అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తే సంపద సృష్టి, పేదరిక నిర్మూలన కష్టమేమీ కాదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి.. ధన బలాన్ని పూర్తిగా నియంత్రించగలిగిందని చంద్రబాబు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం కూటమి విజయాన్ని మాత్రమే కాకుండా మంచి పాలన, సామాజిక న్యాయం, నూతన నాయకత్వం, ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రజలకున్న విశ్వాసానికి నిదర్శనమని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయేకు ప్రజా మద్దతు మరింత పెరిగిందని ఆయన వివరించారు. పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికలు రెండింటినీ కలిపి ఎన్డీయే కూటమికి 58.9 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఇది 3.6 శాతం పెరిగిందన్నారు. ఇదే సమయంలో వైసీపీ ఓట్ల శాతం 39.81 శాతం నుంచి 33.56 శాతానికి పడిపోయిందని, అంటే 6.25 శాతం తగ్గిందని చెప్పారు. ఫలితంగా స్థానిక సంస్థల పోరులో కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల తేడా 25.34 శాతంగా నమోదైందని వివరించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 59.9 శాతం ఓట్లు సాధించగా, వైసీపీకి కేవలం 34.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని సీఎం తెలిపారు. పట్టణాల్లో కూటమి ఏకంగా 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందన్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి 57.6 శాతం, వైసీపీకి 39.7 శాతం ఓట్లు దక్కగా.. కూటమి 87.5 శాతం స్ట్రైక్ రేట్ నమోదు చేసిందని చెప్పారు. కూటమికి, వైసీపీకి మధ్య ఓట్ల వ్యత్యాసం పట్టణాల్లో 25.6 శాతంగా, గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 659 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి ఏకంగా 575 స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి చెప్పారు. మొత్తం 28 జిల్లాల్లో 27 జిల్లాల్లో కూటమి పూర్తి ఆధిపత్యం సాధించిందని, ఒక్క అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే వైసీపీ అధిక జడ్పీటీసీ స్థానాలు గెలుచుకుందని పేర్కొన్నారు. ఏడు జిల్లాల్లో వైసీపీ ఒక్క జడ్పీటీసీ సీటును కూడా గెలవలేకపోయిందని వివరించారు. అలాగే, 9,818 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతం మండల పరిషత్ అధ్యక్ష పదవులు కూటమికే దక్కనున్నాయని తెలిపారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించిందని చంద్రబాబు పేర్కొన్నారు. మొత్తం 100 మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవుల్లో కూటమి 94 స్థానాలను గెలుచుకుంది. ఇందులో 13 మేయర్ స్థానాల్లో 12 స్థానాలు, 87 ఛైర్‌పర్సన్ స్థానాల్లో 82 స్థానాలు కూటమి ఖాతాలో పడ్డాయి. పార్టీల వారీగా చూస్తే తెలుగుదేశం పార్టీ 70, జనసేన 20, బీజేపీ 4 మేయర్/ఛైర్‌పర్సన్ స్థానాలను దక్కించుకున్నాయి. మొత్తం 3,941 వార్డుల్లో కూటమి 3,233 వార్డులను (82 శాతం) గెలుచుకుంది. 100 పట్టణ స్థానిక సంస్థల్లో 95 చోట్ల కూటమి కౌన్సిల్ మెజారిటీ సాధించగా, 16 మున్సిపాలిటీల్లోని అన్ని వార్డులనూ క్లీన్ స్వీప్ చేసింది. మరోవైపు, వైసీపీ కేవలం నాలుగు పట్టణ స్థానిక సంస్థలను, 558 వార్డులను మాత్రమే గెలుచుకుందని, 22 పట్టణాల్లో ఒక్క వార్డు కూడా గెలవలేకపోయిందని ముఖ్యమంత్రి తెలిపారు.

### ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు

# అందని చికిత్స సిరంజీలు కూడా లేని దుస్థితి

## బీఆర్ఎస్ యువజన నాయకుడు గద్దల రామకృష్ణ




**భద్రాద్రి జిల్లా నవంబర్ 09 ( తొలివార్త ) :** అశ్వాపురం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదవాడికి అనారోగ్యం వస్తే ఆశ్రయమిచ్చేది ప్రభుత్వ ఆసుపత్రే అలాంటి ఆసుపత్రిలోనే కనీస వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోతే సామాన్య ప్రజలు తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలి? ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందించాల్సిన అశ్వాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందని చికిత్స కనీసం ఇంజక్షన్ చేసేందుకు అవసరమైన సిరంజీలు కూడా అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.గత కొంతకాలంగా సిరంజీల కొరత కొనసాగుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాము కాటు, తేలు కాటు, ప్రమాదాలు, ఇతర అత్యవసర ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు తక్షణ వైద్యం అందించాల్సిన సమయంలో అవసరమైన వైద్య సామగ్రి లేకపోవడం తీవ్ర ఇబ్బందులకు దారితీసే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకుడు గద్దల రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులు పేదలు, కూలీలు, రైతులు, సామాన్య ప్రజలకు భరోసాగా నిలవాలని, ప్రాథమిక వైద్య సదుపాయాల కోసం కూడా రోగులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండకూడదని అన్నారు. ఆసుపత్రిలో అవసరమైన సిరంజీలు, మందులు, అత్యవసర వైద్య పరికరాలను వెంటనే అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది కొరత ఉంటే దానిని కూడా పరిష్కరించాలని అధికారులను కోరారు.ప్రభుత్వ వైద్యం పేదవాడికి ఉపకారం కాదు.. అది అతని హక్కు. డబ్బున్నవారు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించగలరు. కానీ రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రే ఏకైక ఆధారం. అందుకే అశ్వాపురం ప్రభుత్వ ఆసుపత్రిని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని గద్దల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ము రాంబాబు మడిపల్లి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న తొమ్మిది మందిపై కేసులు


## రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్న వలిగొండ పోలీసులు



**వలిగొండ, నవంబర్ 09 ( తొలివార్త ):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న తొమ్మిది మందిపై వలిగొండ పోలీసులు కేసులు నమోదు చేశారు. వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రొద్దుటూరు-- ఎదుళ్లగూడెం గ్రామాల శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న రెండు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వలిగొండ ఎస్సై మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మనస్థాపనికి గురై యువకుడి ఆత్మహత్య

**వనస్థలిపురం నవంబర్ 09 ( తొలివార్త ):** 08.11.2026 నాడు రాత్రి సుమారు 08:30 గంటల సమయంలో కేతాల శివకుమార్, తండ్రి శ్రీనివాస్, వయస్సు 25 సంవత్సరాలు, నివాసం రోడ్ నం. 4, గ్రీన్ హిల్స్ కాలనీ, కొత్తపేట, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా అనే యువకుడు తన గర్ల్‌ఫ్రెండ్ నివాసమైన వనస్థలిపురం, శారదానగర్, కు వెళ్లాడు. అక్కడ సదరు యువకుడు న్యూసెన్స్ చేస్తుండగా, యువతి ఇక్కడ న్యూసెన్స్ చేయకుండా ఇంటికి వెళ్లాలని పలుమార్లు చెప్పినప్పటికీ వినకుండా అక్కడే ఉన్నాడు. దీంతో యువతి అతడిని ఇంటికి పంపించేందుకు ఓలా క్యాబ్ యాప్ ద్వారా ఆటో బుక్ చేసి, ఇంటి బయట ఆటో కోసం వేచి చూస్తుండగా, సదరు యువకుడు మనస్తాపానికి గురై ఇంటిలోని బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకుని, ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



# ఘనంగా రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నూతనకల్. నవంబర్ 09 ( తొలివార్త ):** నూతనకల్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశానుసారం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో నకిరేకంటి వెంకన్న యాస పుల్లారెడ్డి చురుకంటి చంద్రారెడ్డి ఉప సర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి జహంగీర్ ఇమ్మారెడ్డి మహేష్ రెడ్డి జటంగి గణేష్ పగిళ్ల అశోక్ నెల్లుట్ల మహేష్ కందుకూరి శ్రీకాంత్ చందు మురళి శ్రీను ఉపేందర్ భాను తదితరులు పాల్గొన్నారు





# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. ఏపీ, తెలంగాణలో వర్షాలు!

**ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం**

**తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన**

**తెలంగాణలో క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత, పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

**కోస్తాంధ్ర, రాయలసీమలో ఉరుములతో కూడిన వర్షాలు!**

**గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం**



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. నవంబర్ 13న ఆగ్నేయ బంగాళాఖాతంలో ఇది ఏర్పడవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, యానాం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.మరోవైపు, తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఈశాన్య దిశ నుంచి వీస్తున్న పొడి గాలుల కారణంగా రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. హైదరాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతున్నాయి. రాజేంద్రనగర్, శంషాబాద్, మేడ్చల్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లో ఉదయం వేళ దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. సాయంత్రం 5:30 తర్వాత చలి గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఇక ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 14-16 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో సాధారణం కన్నా 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. కొత్తగా ఏర్పడనున్న అల్పపీడనం ప్రభావంతో రానున్న రోజుల్లో వర్ష సూచనలు ఉన్నాయి. సోమవారం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు కూడా వీయొచ్చు. తెలంగాణలోనూ అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడొచ్చని, సోమవారం తర్వాత వాతావరణం పొడిగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.అల్పపీడనం ఏర్పడిన తర్వాత దాని కదలిక, తీవ్రతను బట్టి వర్షాల ప్రభావంపై స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, చలి నుంచి, ఆకస్మిక వర్షాల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# కడపలో ఆకతాయిల వీరంగం భయాందోళనలో ప్రజలు

**కడప నగరంలో పరిస్థితులు కట్టు తప్పుతున్నాయి. వారాంతపు రోజుల్లో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు**

**శివారు ప్రాంతాల్లో మద్యం తాగి ఆ మత్తులో దాడులకు పాల్పడుతున్నారు**




కడప నగరంలో ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. ముఖ్యంగా వారాంతపు రోజుల్లో శివారు ప్రాంతాల్లోని డాబాలు, బార్లలో మద్యం సేవించి, ఆ మత్తులో దాడులకు తెగబడుతున్నారు. రాత్రి వేళల్లో ముఠాలుగా ఏర్పడి నడిరోడ్లపై గొడవలకు దిగడమే కాకుండా ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేస్తున్నారు. దీంతో నగరవాసులు తీవ్ర కలవరానికి గురవుతున్నారు. తాజాగా అర్ధరాత్రి ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న కడప అనే ఆంగ్ల అక్షరాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. కూడలి చుట్టూ ఉన్న బండలను, సెవెన్ రోడ్స్ అనే అక్షరాలను కూడా తొలగించారు. పక్కనే ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఆకతాయిలు ఈ స్థాయిలో ఆగడాలకు పాల్పడటం గమనార్హం.మరో ఘటనలో మృత్యుంజయకుంట సమీపంలో రాత్రి 11:30 గంటల సమయంలో కొందరు యువకులు రెండు ముఠాలుగా విడిపోయి నడిరోడ్డుపై పరస్పరం దాడులు చేసుకున్నారు. అలాగే, పాత బస్టాండ్ నుంచి విధి నిర్వహణ ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ ప్రైవేట్ ఉద్యోగిని కొందరు గుర్తుతెలియని యువకులు వెంబడించి భయభ్రాంతులకు గురిచేసి అతని సెల్‌ఫోన్ లాక్కెళ్లారు.నగరంలోని ఎర్రముక్కపల్లె, ప్రకాష్‌నగర్, అల్మాస్‌పేట, రాజంపేట బైపాస్ రోడ్డు, చలమారెడ్డి కూడలి, బిల్టప్, గౌస్‌నగర్, అగాడి, రాజారెడ్డివీధి, మాసాపేట, దొరల సమాధులు, శంకరాపురం, ఫక్కీర్‌పల్లె కూడలి, చిన్నచౌకు, మేరీనగర్, అంగడివీధి వంటి ప్రాంతాల్లో యువత ఆగడాలు మరీ ఎక్కువయ్యాయి. మద్యం మత్తులో ముఠాలుగా ఏర్పడి ఘర్షణ పడటమే కాకుండా, అటుగా వెళ్లే వాహన చోదకులను ఆపి గొడవలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలోనే పలు రోడ్డు ప్రమాదాలకూ కారణమవుతున్నారు.నగర శివారు ప్రాంతాలతో పాటు చాలా చోట్ల కనీసం సీసీ కెమెరాల నిఘా కూడా లేకపోవడం ఆకతాయిలకు వరంగా మారింది. దీంతో అర్ధరాత్రి వేళల్లో అల్లరిమూకలు నానా రభస సృష్టిస్తున్నారు. రాత్రి వేళల్లో గస్తీ కాయాల్సిన బ్లూకోల్ట్స్ వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తోంది. ప్రస్తుతం వరుస ఎన్నికల బందోబస్తు కారణంగా పోలీసులు అందుబాటులో లేకపోవడంతో, రోడ్లపై జులాయిల ఇష్టారాజ్యం నడుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నిఘాను పటిష్ఠం చేసి ఈ ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# దీపావళి సంబరాల వేళ అపశ్రుతులు

**టపాసుల నిప్పురవ్వలతో పలుచోట్ల అగ్నిప్రమాదాలు**

**దీపావళి పండగ వేళ కొన్నిచోట్ల అగ్నిప్రమాదాలు ఆందోళనకు గురిచేశాయి**

**టపాసుల నుంచి ఎగసిన నిప్పురవ్వలు మంటలై కొన్ని వ్యాపార సముదాయాలను చుట్టుముట్టాయి**

**దీపావళి సంబరాల వేళ పలుచోట్ల అగ్నిప్రమాదాలు**



దీపావళి పండగ వేళ కొన్నిచోట్ల అగ్నిప్రమాదాలు ఆందోళనకు గురిచేశాయి. టపాసుల నుంచి ఎగసిన నిప్పురవ్వలు మంటలై కొన్ని వ్యాపార సముదాయాలను చుట్టుముట్టాయి. క్షణాల్లో ఎగసిపడ్డ మంటలతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.దీపావళి వేళ అగ్నిప్రమాదాలు : దీపావళి వేళ పలు చోట్ల అగ్నిప్రమాదాలు జరిగాయి. కృష్ణా జిల్లా గన్నవరంలోని గృహోపకరణాల సామగ్రి విక్రయ దుకాణంలో మంటలు చెలరేగాయి. ఘటనాస్థలికి చేరుకుని ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఆయిల్ గోదాంపై తారాజువ్వ పడింది. దీంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఆయిల్ గోదాములో మంటలు చెలరేగాయి. తెనాలి గంగానమ్మపేటలోని ఎలక్ట్రిక్ స్కూటీల షోరూంలో అగ్నిప్రమాదం జరిగింది. మూడు ఎలక్ట్రిక్ స్కూటీలు దగ్ధం, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పారు.కృష్ణా జిల్లా గన్నవరం పట్టణంలోని గృహోపకరణాల సామగ్రి విక్రయ దుకాణంలో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన నిర్వాహకులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీపావళి టపాసుల నిప్పురవ్వలు పడటంతో చెక్కముక్కలకు అంటుకొని మంటలు చెలరేగాయని దుకాణ నిర్వాహకుడు తెలిపారు.శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస పట్టణంలో తారాజువ్వ ఆయిల్ గోదాంపై పడటంతో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలు అలముకొని మంటలు రావటాన్ని గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి ఎస్ శ్రీనివాసరావు నేతృత్వంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.కృష్ణా జిల్లా కోడూరులోని వంతెన కూడలి వద్ద ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. తెల్లవారుజామున ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలార్పారు.గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీనివాస బైక్ షోరూంలో రాత్రి 8.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు షోరూం అంతటా వ్యాపించడంతో లోపల ఉన్న పలు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదానికి గల కారణంగా అనుమానిస్తున్నారు. షో రూమ్?లో 4 ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. నష్టం వివరాలు తెలియాల్సి ఉందని, యజమాని సుధాకర్ రాజు తెలిపారు.ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని నాగార్జున జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న భాగ్యలక్ష్మి ఫొటో ఫ్రేమ్స్ స్టూడియోలో అగ్నిప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగసిపడి షాప్ మొత్తం తగలబడింది. ఫొటో ఫ్రేమ్స్, ఇతర సామగ్రి దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమిక అంచనా. సుమారుగా 15 లక్షల రూపాయల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని చెబుతున్నారు.దీపావళి పండుగ వేళ విజయనగరం జిల్లా రాజాంలోని ఆటోమట్టుబైల్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు 25 లక్షల రూపాయల విలువ గల స్పేర్ పార్ట్స్, ఇంజిన్ ఆయిల్స్ కాలిపోయాయి. రాజాం పట్టణం డోలపేట సమీపంలోని కాలనీవాసులు టపాసులు కాల్చడంతో క్రాకర్స్ వలన ఎగసిపడిన నిప్పురవ్వలతో ఆటోమొబైల్ షాప్ దగ్ధమైంది. షాపులో ఉన్న లూబ్రికెంట్స్ వలన మంటలు చెలరేగి భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. మంటల వలన వ్యాపించిన పొగతో కాలనీవాసులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.దీపావళి సంబరాల వేళ రాష్ట్రంలో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా రాజాంలోని ఆటోమొబైల్ షోరూమ్‌లో ప్రమాదం జరిగి భారీ ఆస్తి నష్టం జరగడంపై వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా కృష్ణా జిల్లా గన్నవరం, ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ప్రమాదాలపై ఆరా తీశారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# హైదరాబాద్‌పై కాలుష్య పంజా

**ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!**

**హైదరాబాద్‌ను వణికిస్తున్న వాయు కాలుష్యం**

**ప్రమాదకరంగా 410కి చేరిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్**

**ఐటీ కారిడార్‌లోని పలు ప్రాంతాల్లో అత్యధిక కాలుష్యం**

**సాధారణం కంటే నాలుగు రెట్లు పెరిగిన పీఎం 2.5 స్థాయిలు**

**వాహనాలు, నిర్మాణాలే ప్రధాన సమస్యగా గుర్తింపు**

ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ూూ× ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# 15 మీటర్లకుపైగా లోతు, భారీనౌకల రాకపోకలకు అనుకూలం

**కొత్త పోర్టుల నిర్మాణానికి గడువు పెంపు**

**రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నాలుగు పోర్టులను పూర్తిచేసేందుకు**

**గుత్తేదారులకు ప్రభుత్వం గడువు పొడిగించింది**

**వివిధ కారణాలతో నిర్మాణ పనులు ఆలస్యమవుతుండటంతో**

**తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది**



రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న నాలుగు పోర్టులను పూర్తిచేసేందుకు గుత్తేదారులకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఈ ఏడాదిలో 2 పోర్టులు, మిగతా వాటిని వచ్చే సంవత్సరంలో పూర్తిచేయాలని తొలుత అనుకుంది. వివిధ కారణాలతో నిర్మాణ పనులు ఆలస్యమవుతుండటంతో తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది. 4 పోర్టుల తొలిదశ పనులు పూర్తయితే ఏటా 108 మిలియన్ మెట్రిక్ టన్నుల(ఎంఎంటీ) కార్గో రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం పోర్టులను ప్రభుత్వం నిర్మిస్తోంది. కాకినాడ పోర్టును పీపీపీ విధానంలో చేపట్టారు.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్టు నిర్మాణాన్ని 2027 జూన్ నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం గడువు పెట్టింది. దీనిద్వారా ఏటా 24 ఎంఎంటీ సరకు రవాణాకు అవకాశముంటుందని అంచనా. కేప్‌సైజ్ నౌకలు, పెద్దపరిమాణం గల బల్క్ క్యారియర్లు, పెద్దకంటెయినర్ నౌకల రాకపోకలకు అనుగుణంగా 15.50 మీటర్ల లోతు ఉండేలా షిప్పింగ్ డ్రాఫ్ట్ నిర్మాణం కొనసాగుతోంది. లోతు ఎక్కువయ్యేకొద్దీ భారీనౌకల రాకపోకలకు సులువవుతుంది. తీరం వెంట 1.8 కి.మీ. సముద్రతీరం (వాటర్ ఫ్రంట్) ఉంటుంది. ఈ పోర్టు నిర్మాణానికి రూ.4,381.90 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. సుమారు 78 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం 4 బెర్త్‌లను అభివృద్ధి చేస్తుండగా ఒకదాన్ని బొగ్గు రవాణాకు కేటాయించ నున్నారు.మాస్టర్‌ప్లాన్ ప్రకారం 13 బెర్త్‌ల నిర్మాణం పూర్తయితే ఏటా 83 ఎంఎంటీకి పైగా సరకు రవాణాకు అవకాశం ఏర్పడనుంది. ఈ పోర్టు కార్యకలాపాలను విస్తరించటానికి వీలుగా విశాఖపట్నం పోర్టు అథారిటీతో ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. పోర్టుకు అనుసంధానంగా సుమారు 20 వేల ఎకరాల్లో భారీ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అందుకు అనుగుణంగా పోర్టు సమీపంలోని ఉప్పు భూములను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ డీపీఐఐటీ అంగీకరించింది.నెల్లూరు జిల్లాలో రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని 2027 ఏప్రిల్‌కి పూర్తిచేయాలని ప్రభుత్వం తెలిపింది. దీనిద్వారా ఏటా 34 ఎంఎంటీ సరకు రవాణా జరుగుతుందని అంచనా. దీని షిప్పింగ్ డ్రాఫ్ట్ 16 మీటర్లు, వాటర్ ఫ్రంట్ 1.4 కి.మీ. ఉండనుంది. ఈ పోర్టు నిర్మాణానికి రూ.4,929.40 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీని నిర్మాణ పనులు సుమారు 80 శాతం పూర్తయ్యాయి. 4 బెర్త్‌ల నిర్మాణం పూర్తికావొచ్చింది. ఒక బెర్త్‌ను బొగ్గు కోసం, మిగతా మూడింటిని మల్టీపర్పస్ కింద ఏర్పాటు చేయనున్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 19 బెర్త్‌లు నిర్మిస్తే పోర్టు కార్గో రవాణా సామర్థ్యం ఏటా 138.54 ఎంఎంటీలకు చేరనుంది.కృష్ణా జిల్లాలో మచిలీపట్నం పోర్టు నిర్మాణాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీనిద్వారా ఏటా 35 ఎంఎంటీ సరకు రవాణాకు అవకాశం ఏర్పడనుంది. పోర్టు నిర్మాణానికి రూ.5,155.80 కోట్లను సర్కారు వెచ్చిస్తోంది. దీని షిప్పింగ్ డ్రాఫ్ట్ 15.7 మీటర్లు, వాటర్ ఫ్రంట్ 2.2 కి.మీ. ఉండనుంది. ఈ పోర్టు నిర్మాణ పనులు సుమారు 59 శాతం పూర్తయ్యాయి. మొత్తం నాలుగు బెర్త్‌లను మొదటి దశలో ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణం పూర్తికావొచ్చింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం 2వ దశలో పోర్టు విస్తరణ పనులతో కార్గో రవాణా సామర్థ్యం ఏటా 115.97 ఎంఎంటీలకు చేరనుంది.కాకినాడ పోర్టు నిర్మాణ పనులను 2028 సెప్టెంబర్‌కి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మిగతా 3 పోర్టుల కంటే అత్యంత లోతైన డ్రాఫ్ట్‌తో దీన్ని నిర్మించనున్నారు. వాటర్ ఫ్రంట్ 2.2 కి.మీ. ఉండనుంది. ఈ పోర్టు నిర్మాణ పనులు సుమారు 45 శాతం పూర్తయ్యాయి. మొత్తం వాణిజ్య అవసరాల కోసం 7 బెర్త్‌లతో పాటు ఆఫ్‌షోర్ సప్లయ్ వెసల్స్ కోసం ప్రత్యేకంగా బెర్త్‌ను నిర్మించనున్నారు. ఈ పోర్టు కార్గో రవాణా సామర్థ్యం ఏటా 16 ఎంఎంటీలు ఉండనుంది.

# ప్రకాశం బ్యారేజీకి తగ్గిన వరద.. ఊపిరి పీల్చుకున్న డెల్టా రైతులు

**మురసు తుపాను కారణంగా 71 వేల క్యూసెక్కులకు చేరిన ఇన్‌ఫ్లో**


**ప్రస్తుతం బ్యారేజీ వద్ద 12 అడుగులుగా కొనసాగుతున్న నీటిమట్టం**

**సముద్రంలోకి నీటి విడుదలను 3,625 క్యూసెక్కులకు తగ్గించిన అధికారులు**



విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉద్ధృతి గణనీయంగా తగ్గింది. ఇటీవలి మురసు తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా నదికి ప్రవాహం పెరిగి, బ్యారేజీకి సుమారు 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అటు అధికారులు, ఇటు డెల్టా రైతులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిమట్టం 12 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. వరద ప్రవాహం తగ్గడంతో సముద్రంలోకి వదిలే నీటి విడుదలను కూడా అధికారులు క్రమంగా తగ్గిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 7,250 క్యూసెక్కులుగా ఉన్న అవుట్‌ఫ్లోను సాయంత్రానికి 3,625 క్యూసెక్కులకు పరిమితం చేశారు.అదే సమయంలో, కృష్ణా తూర్పు డెల్టా సాగునీటి అవసరాల కోసం కాలువలకు సుమారు 1,516 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో పూర్తిగా అదుపులోకి రావడంతో కృష్ణా డెల్టా ప్రాంతానికి వరద ముప్పు తప్పినట్లయిందని అధికారులు భావిస్తున్నారు.

# దీపావళి విషాదం.. టపాసుల దెబ్బకు హైదరాబాద్‌లో శాశ్వతంగా చూపు కోల్పోయిన వ్యక్తి




దీపావళి పండుగ హైదరాబాద్‌లోని కొన్ని కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. టపాసులు కాలుస్తున్నప్పుడు అజాగ్రత్తగా వ్యవహరించడం, ప్రమాదాలు జరగడంతో 32 మంది కంటి గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో ఒకరు కుడి కంటి చూపును శాశ్వతంగా కోల్పోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనలన్నీ ఆదివారం నగరంలోని మెహిదీపట్నంలో ఉన్న ప్రభుత్వ సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో నమోదయ్యాయి.దీపావళి వేడుకల సందర్భంగా టపాసుల కారణంగా గాయపడిన 32 మంది చికిత్స కోసం సరోజినీ దేవి ఆసుపత్రికి వచ్చారు. వీరిలో గాయాల తీవ్రత ఎక్కువగా ఉన్న ఆరుగురిని ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. వీరిలో నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. మిగిలిన 26 మందికి ప్రాథమిక చికిత్స అందించి, మందులు ఇచ్చి పంపించారు. వారిని తదుపరి పరీక్షల కోసం మళ్లీ రావాలని వైద్యులు సూచించారు.దీపావళి సందర్భంగా ఇలాంటి కేసులు అధిక సంఖ్యలో వస్తాయని ముందే ఊహించిన ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మొత్తం 550 పడకల సామర్థ్యం గల ఈ ఆసుపత్రిలో 20 బెడ్లను ప్రత్యేకంగా టపాసుల బాధితుల కోసం కేటాయించారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందితో పాటు అంబులెన్సులను కూడా సిద్ధంగా ఉంచారు. అత్యవసర కేసులను హైదరాబాద్‌కు తరలించేందుకు జిల్లాల్లోనూ అంబులెన్సులను అందుబాటులో ఉంచారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. మోదిని మాట్లాడుతూ.. గత రెండేళ్ల దీపావళి సీజన్లలో 116, 115 చొప్పున కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. టపాసుల విషయంలో అజాగ్రత్తగా ఉంటే తీవ్రమైన గాయాలు, శాశ్వత అంధత్వం సంభవించే ప్రమాదం ఉందని వైద్యులు ముందుగానే హెచ్చరించారు. అయినప్పటికీ ప్రమాదాలు జరగడం విచారకరం. బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులు, బాటసారులు ఉండటం గమనార్హం.

# వేసవిలో చేతులపై టాన్ పేరుకుండా.. రంగుని మెరుగుపరిచేందుకు ఈ సింపుల్ టిప్స్ ట్రై చేయండి..



వేసవిలో ముఖాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ఎంత ముఖ్యమో, చేతులను జాగ్రత్తగా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. అటువంటి పరిస్థితిలో చేతులపై టాన్ ను తొలగించడానికి ఇంట్లో ఉన్న కొన్ని వస్తువులను ఉపయోగించవచ్చు. ఇది చేతుల రంగును పెంచడమే కాదు వాటికి సహజమైన మెరుపును కూడా ఇస్తుంది. కనుక ఇంట్లోనే ఏ వస్తువులతో టాన్ రిమూవల్ మాస్క్ తయారు చేసుకోవచ్చో ఈ రోజు తెలుసుకుందాం.. వేసవి కాలం చాలా సమస్యలను తెస్తుంది. ముఖ్యంగా చర్మ సంరక్షణ విషయానికి వస్తే తీవ్రమైన సూర్యకాంతి, వేడి గాలుల కారణంగా చర్మం టాన్ అవ్వడం సర్వసాధారణం. దీంతో ముఖ సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపించే మనం.. చేతుల విషయంలో కేరింగ్ ను విస్మరిస్తాము. అయితే చేతులకు కూడా జాగ్రత్త అవసరం. ప్రత్యక్షంగా సూర్య కిరణాలు తాకడం వలన చేతుల రంగును మారుస్తాయి. అవి పొడిగా, ముదురు రంగులో కనిపిస్తాయి. టానింగ్ తొలగించడానికి మార్కెట్లో అనేక ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్నిసార్లు అవి ఖరీదైనవి, కొన్నిసార్లు రసాయనాల కారణంగా ప్రజలు వాటిని ఉపయోగించడానికి ఇష్టపడరు. అటువంటి పరిస్థితిలో సురక్షితమైన, సులభమైన పరిష్కారం వంటింటి చిట్కాలు. ఇంట్లో దొరికే పదార్థాలతో తయారుచేసిన మాస్క్‌లు టానింగ్‌ను తగ్గించడమే కాదు చర్మానికి పోషణనిచ్చి, స్కిన్ కు సహజ మెరుపును తిరిగి ఇస్తాయి. కనుక వేసవిలో టానింగ్ వల్ల ప్రభావితమైన చేతుల రంగును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని సులభమైన, ప్రభావవంతమైన ఇంట్లో తయారుచేసే మాస్క్‌ల గురించి ఈ రోజు తెలుసుకుందాం.. శనగపిండి, పసుపు, పెరుగు మాస్క్ వేసవిలో చేతులపై వచ్చే టానింగ్‌ను తొలగించడానికి శనగపిండి మాస్క్ ఒక అద్భుతమైన నివారణ. దీని కోసం 2 చెంచాల శనగపిండి, 1 చిటికెడు పసుపు , 1 చెంచా పెరుగు కలిపి పేస్ట్ తయారు చేసుకోవాలి. దీని తర్వాత దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. ఈ మిశ్రమాన్ని చేతులకు రాసుకుని 20 నిమిషాల తర్వాత చేతులు కడుక్కోవాలి. ఈ మాస్క్ ట్యానింగ్‌ను తొలగించడమే కాదు చర్మాన్ని తేమగా కూడా ఉంచుతుంది.

# కంటి నిండా నిద్ర పట్టట్లేదా..? ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసా..?



నిద్రలేమి సమస్య ఈ రోజుల్లో చాలా మందిని వేధిస్తోంది. సరిపడా నిద్ర లేకపోతే ఆరోగ్యంపై చాలా చెడు ప్రభావాలు పడతాయి. ఈ నిద్రలేమికి ప్రధాన కారణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకుని, ఒకే సమయానికి లేవడం శరీరానికి చాలా మంచిది. కానీ ఈ సమయాలను తరచూ మార్చడం వల్ల శరీరం గందరగోళానికి గురై నిద్ర పట్టకపోవచ్చు. అందుకే ఒకే సమయానికి నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి. చాలా మంది పడుకునే ముందు ఫోన్ ను ఎక్కువగా చూస్తుంటారు. ఇది మెదడును నిద్ర మోడ్ లోకి వెళ్లనివ్వదు. మొబైల్ స్క్రీన్ నుండి వచ్చే నీలి రంగు కాంతి నిద్రకు సహాయపడే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుంది. కాబట్టి పడుకునే ముందు కనీసం ఒక గంట పాటు మొబైల్ కు దూరంగా ఉండటం మంచిది. రాత్రిపూట కాఫీ, టీ వంటి కెఫిన్ ఉన్న డ్రింక్ లు తాగడం వల్ల నిద్రకు ఆటంకం కలుగుతుంది. కెఫిన్ మెదడును చురుకుగా ఉంచి నిద్రను దూరం చేస్తుంది. అందుకే సాయంత్రం తర్వాత ఈ డ్రింక్ లను తగ్గించుకోవడం మంచిది. రాత్రి సమయంలో ఎక్కువగా తింటే అజీర్తి సమస్యలు వస్తాయి. ఇది నిద్రకు భంగం కలిగిస్తుంది. నిద్రపోవడానికి కనీసం రెండు గంటల ముందు తేలికపాటి భోజనం చేయడం ఉత్తమం. రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. వ్యాయామం ఒత్తిడిని తగ్గించి మంచి నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. వాకింగ్, యోగా, స్విమ్మింగ్ వంటివి మనసుకు, శరీరానికి విశ్రాంతినిస్తాయి. పగటిపూట ఎక్కువ గంటలు నిద్రపోతే రాత్రిపూట నిద్ర పట్టదు. మధ్యాహ్నం కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకుంటే, 15 నుండి 20 నిమిషాలకు మించి నిద్రపోవద్దు. సాయంత్రం 3 గంటల తర్వాత పడుకోవడం మంచిది కాదు. ప్రస్తుత బిజీ లైఫ్‌లో పని ఒత్తిడి, వ్యక్తిగత ఒత్తిడి నిద్రను దెబ్బతీస్తున్నాయి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి మెదడుకు విశ్రాంతినిచ్చే పనులు చేయాలి. ధ్యానం, యోగా, పాటలు వినడం, పుస్తకాలు చదవడం వంటివి మనసుకు ప్రశాంతతను ఇస్తాయి. నిద్రపోయే గది చాలా చల్లగా గానీ, చాలా వేడిగా గానీ ఉండకూడదు. గాలి బాగా వచ్చేలా చూసుకోవాలి. అలాగే పడుకునే మంచం కూడా సౌకర్యవంతంగా ఉండాలి. ఇవి నిద్రకు ఆటంకం లేకుండా చేస్తాయి. మద్యం సేవించడం, పొగ త్రాగడం, జంక్ ఫుడ్ తినడం వంటి అలవాట్లు నిద్రను దెబ్బతీస్తాయి. వీటిని తగ్గించి తాజా పండ్లు, కూరగాయలు, తేలికపాటి రాత్రి భోజనం వంటి ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం వల్ల నిద్ర మెరుగుపడుతుంది. నిద్రలేమిని చిన్న సమస్యగా తీసిపారేయకూడదు. ఇది ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ఈ చిన్న చిన్న కారణాలను గుర్తించి వాటిని సరిచేసుకుంటే మళ్లీ చక్కటి నిద్రను పొందవచ్చు.

# మీ శరీరానికి కావాల్సిన పోషకాలు వీటిలో ఫుల్ ఉంటాయి..! తినడం అస్సలు మిస్సవ్వొద్దు..!



బాదంలో శరీరానికి అవసరమైన అనేక పోషకాలు ఉంటాయి. వీటిని రాత్రి నానబెట్టి ఉదయం తినడం వల్ల ఆరోగ్యానికి అనేక రకాల లాభాలు కలుగుతాయి. జీర్ణం, గుండె ఆరోగ్యం, మెదడు పనితీరు, బరువు నియంత్రణ, నిద్ర సమస్యలు వంటి వాటికి బాదం ఎంతో సహాయపడుతుంది. బాదం గింజలు ఆరోగ్యానికి చాలా మంచివి. అయితే వీటిని నానబెట్టి తింటే ఇంకా ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున తింటే శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. రోజూ ఇలా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా లభిస్తుంది. రాత్రి పడుకునే ముందు బాదం గింజలను నీటిలో నానబెట్టాలి. ఉదయం వాటిని నీటిలోంచి తీసి వాటిపై ఉన్న పొట్టును తీసేసి తినాలి. ఇలా తింటే బాదంలో ఉన్న పోషకాలు శరీరానికి సులభంగా అందుతాయి. నానబెట్టిన బాదంలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. మలబద్ధకం, అజీర్ణం వంటి వాటి నుంచి ఉపశమనం కలిగించి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి బాదం మంచి ఆప్షన్. ఇందులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు ఆకలిని నియంత్రించి ఎక్కువగా తినకుండా ఆపుతాయి. తక్కువ కేలరీలు ఉన్నా ఎక్కువ పోషణను అందించే బాదం శరీరాన్ని ఉత్సాహంగా ఉంచుతుంది. బాదంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను కాపాడటంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి మంచి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతాయి. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున బాదం తినడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. బాదంలో ఉండే విటమిన్ ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు కణాల ఎదుగుదలకు సహాయపడతాయి. విద్యార్థులు తరచుగా దీన్ని తీసుకుంటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. బాదంలో ఉండే మెగ్నీషియం అనే ఖనిజం నరాలను ప్రశాంతంగా ఉంచి మంచి నిద్ర పట్టడానికి సహాయపడుతుంది. నిద్రలేమితో బాధపడే వారు దీన్ని తినడం వల్ల నిద్రలో మార్పును గమనించవచ్చు. రోజూ కొన్ని బాదం లను నానబెట్టి తినే అలవాటు చేసుకోవడం వల్ల ఎన్నో శారీరక, మానసిక ప్రయోజనాలు పొందవచ్చు.

# కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఉత్తమ వ్యాయామాల గురించి మీకు తెలుసా..?



వేయించిన ఆహారాలు, ఒత్తిడి క్రమంగా కాలేయాన్ని బలహీనపరుస్తాయని చెబుతున్నారు నిపుణులు. మందుల సహాయం తీసుకునే ముందు కాలేయాన్ని లోపలి నుండి బలోపేతం చేసే కొన్ని వ్యాయామాల గురించి తెలుసుకుందాం. మీ కాలేయం సంవత్సరాల తరబడి ఫిట్‌గా, చురుగ్గా ఉండాలని మీరు కోరుకుంటే, ఉత్తమ.. శరీరంలోని ప్రతి భాగం చాలా ముఖ్యమైనది. కానీ ఈ యంత్రం ఇంజిన్ బలహీనంగా మారితే ఏం జరుగుతుంది? మన శరీరంలో కాలేయం ఎంతో ముఖ్యమైది. ఇది శరీరంలోని అతి ముఖ్యమైన, కష్టపడి పనిచేసే అవయవాలలో ఒకటి. కాలేయం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడటమే కాకుండా శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడానికి కూడా పనిచేస్తుంది.

### కపాలభాతి ప్రాణాయామం

ఇది కాలేయానికి అత్యంత ప్రభావవంతమైన యోగా ఆసనం అని భావిస్తారు. ఈ ప్రాణాయామంలో వేగంగా గాలి వదులుతూ కడుపు లోపలికి, బయటకు కదిలిస్తూ ఉంటుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది. రోజూ 5-10 నిమిషాలు కపలాభతి చేయడం వల్ల కాలేయ పనితీరు మెరుగుపడుతుంది. కపలాభతి అనేది ఒక శక్తివంతమైన ప్రాణాయామం, దీనిలో శ్వాసను వదులుతున్నప్పుడు ఉదర కండరాలు వేగంగా సంకోచిస్తూ సదలిస్తుంటాయి. ఇది కేవలం శ్వాస ప్రక్రియ మాత్రమే కాదు, ఒక రకమైన డీటాక్స్ కూడా.

### కాలేయానికి ఎలా ఉపయోగపడుతుంది?

కొవ్వు పేరుకుపోకుండా నిరోధిస్తుంది: కపలాభతి కడుపులోని అంతర్గత అవయవాలను సక్రియం చేస్తుంది. ఇది కాలేయంపై పేరుకుపోయిన కొవ్వును తగ్గిస్తుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది: ఈ ప్రాణాయామం కాలేయం వైపు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. కణాలు ఎక్కువ ఆక్సిజన్‌ను అందించడానికి, మెరుగ్గా పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. డీటాక్స్‌లో సహాయపడుతుంది: కపలాభతి శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగిస్తుంది. కాలేయం పనిని సులభతరం చేస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది: మానసిక ఒత్తిడి కాలేయ ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. కపలాభతి మనస్సును ప్రశాంతపరుస్తుంది. మరియు హార్మోన్లను సమతుల్యంగా ఉంచుతుంది. మీ కాలేయం ఆరోగ్యంగా ఉండాలని, జీవితాంతం వ్యాధులకు దూరంగా ఉండాలని మీరు కోరుకుంటే, ప్రతి ఉదయం కేవలం 10 నిమిషాలు కపలాభతి ప్రాణాయామం చేయడం అలవాటు చేసుకోండి. యోగ ఒక బహమతి లాంటిది. ఇది ఎటువంటి ఖర్చు లేకుండా మిమ్మల్ని అంతర్గతంగా ఆరోగ్యంగా చేస్తుంది.

# రాత్రి పూట వెల్లుల్లి తింటే ఆరోగ్యానికి ఎన్ని లాభాలో తెలుసా..?



వెల్లుల్లి ఒక అద్భుతమైన ఔషధ గుణాలు కలిగిన పదార్థం. రాత్రి పడుకునే ముందు పచ్చి వెల్లుల్లిని తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఇది ఒత్తిడిని తగ్గించడంతో పాటు నిద్రను మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యం, షుగర్, కొలెస్ట్రాల్, బరువు నియంత్రణలోనూ సహాయపడుతుంది. వెల్లుల్లిని రాత్రి పడుకునే ముందు తింటే మన శరీరానికి ఎన్నో లాభాలు కలుగుతాయి. వెల్లుల్లిలో ఉండే సహజ గుణాలు శరీరాన్ని శుభ్రం చేసి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పచ్చి వెల్లుల్లి మన శరీరాన్ని, మనసును రిలాక్స్ చేస్తుంది. ఒత్తిడిని తగ్గించి నిద్ర సమస్యలను దూరం చేస్తుంది. మెదడు నాడీ వ్యవస్థపై మంచి ప్రభావం చూపి గాఢమైన నిద్ర పట్టేలా చేస్తుంది. నిద్రలేమితో బాధపడే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. వెల్లుల్లి శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది. షుగర్ ఉన్నవారికి ఇది సహజ ఔషధంలా పని చేస్తుంది. రోజూ తగిన మోతాదులో తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పచ్చి వెల్లుల్లి తినడం వల్ల అధిక కొలెస్ట్రాల్ సమస్య తగ్గుతుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి శరీరానికి అవసరమైన మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతుంది. దీనివల్ల గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది. వెల్లుల్లిలో యాంటీబాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీఫంగల్ గుణాలు ఉంటాయి. ఇవి శరీరాన్ని రోగాల నుంచి కాపాడతాయి. తరచుగా జలుబు, దగ్గు, జ్వరం వచ్చే వారికి ఇది ఒక రక్షణ కవచంలా పని చేస్తుంది. పచ్చి వెల్లుల్లి శరీరంలోని కొవ్వును వేగంగా కరిగించడానికి సహాయపడుతుంది. ఇది మెటబాలిజంను పెంచి బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది. ఆకలిని నియంత్రించడం వల్ల ఎక్కువగా తినే అలవాటు తగ్గుతుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల మన ఆరోగ్యానికి ఎన్నో లాభాలు కలుగుతాయి. ఇది పూర్తిగా సహజమైన పద్ధతి. అయితే ఏవైనా అనూహ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే నిపుణుల సలహా తీసుకోవాలి.

# జామకాయ అనుకునేరు.. కానేకాదు! ఇదోక ప్రకృతి వరం.. క్యాన్సర్, ఊబకాయంకి దివ్యౌషధం..



ఆరోగ్యానికి మేలు చేసే కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సొరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది.. ప్రతిరోజూ మనం వంట కోసం వివిధ రకాల కూరగాయలను ఉపయోగిస్తుంటాం.. అవి నాలుకకు రుచికరంగా ఉండటమే కాకుండా, ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంటాయి. అలాంటి కూరగాయలలో చయోటే అదేనండీ సీమ వంకాయ ఒకటి. దీనిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. బాటిల్ గోర్డ్ లేదా సొరకాయ జాతికి చెందిన ఈ కూరగాయ.. పోషకాలకు మూలం. ఇది ఊబకాయం, ప్రాణాంతక క్యాన్సర్‌లను నివారించడంలో బలేగా సహాయపడుతుంది. మరి వీటిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..

### గుండె ఆరోగ్యానికి సప్లిమెంట్

సీమ వంకాయలలో ఫైటోకెమికల్స్ అధికంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహాన్ని మెరుగుపరచడంలో, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అలాగే ఇందులో ఉండే మైరిసెటిన్ కొలెస్ట్రాల్, వాపు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది.

### చర్మ క్యాన్సర్ నివారణకు దివ్యౌషధం

సీమ వంకాయ లోప, బయటి తొక్కలో క్యాన్సర్‌ను నివారించగల యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మ క్యాన్సర్‌ను నివారించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.

### హిందీ సప్లిమెంటరీ పరీక్షకు ఒకేఒక్కడు.. ఇన్విజిలేటర్లేమో ముగ్గురు!

శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం శరీరంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సీమ వంకాయ ఒక గొప్ప ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ రోగులు తినడానికి ఉత్తమమైన కూడా.

### లివర్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది

సీమ వంకాయకు కాలేయంలో అనవసరమైన కొవ్వు పేరుకుపోకుండా నిరోధించే సామర్థ్యం ఉంది. గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఇది మంచి ఆహారం. ఎందుకంటే దీనిలోని %దీ%9 ప్రోటీన్ పిండం అభివృద్ధికి, ముఖ్యంగా మెదడు, వెన్నుపాము అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది అకాల జనన అవకాశాలను తగ్గిస్తుంది. అధ్యయనాల ప్రకారం సీమ వంకాయలో లుకేమియా, గర్భాశయ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ కణాల పెరుగుదలను నెమ్మదింపజేసే ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వంకాయలోని యాంటీఆక్సిడెంట్లు మరియు పోషకాలు కణాల నష్టాన్ని నివారించడంలో సహాయపడతాయి. ఇది శరీరం యొక్క వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుందని అనేక అధ్యయనాలు చూపించాయి. అలాగే, ఈ వంకాయ వాపుకు దివ్యౌషధం. విటమిన్ సి సమృద్ధిగా ఉండే ఈ కూరగాయ వర్షాకాలం, శీతాకాలంలో సాధారణంగా కనిపించే వివిధ బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి భలేగా సహాయపడుతుంది.

# ఇలాంటి గుణాలున్నావారు నిత్య అసంతృప్తి వాదులు వీరు సుఖంగా ఉండరు, ఎదుటివారు ఉంటే ఓర్వలేరు



మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో ఒకరు విదురుడు. అంబిక దాసికి, వ్యాసుడికి జన్మించినవాడు విదురుడు. అతని తెలివితేటల కారణంగా ప్రజలు ఇప్పటికీ విదురుడిని గుర్తుంచుకుంటారు. విదురుడు తన జ్ఞానం, అనుభవం ద్వారా ధృతరాష్ట్రునికి చెప్పిన నీతులను విదుర నీతిగా ప్రసిద్ధిగంచాయి. వీటిని పాటించడం వల్ల జీవితం అత్యున్నత స్థాయిలో ఉంటుందని పండితులు చెబుతారు. అదే విధంగా మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే సరైన మార్గదర్శకత్వం అవసరం.. అని విదుర్ నీతిలో అనేక విషయాలు చెప్పబడ్డాయి. మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే ప్రతికూల ఆలోచనలు వదిలి సానుకూల ఆలోచనలు చేయాలి. మంది గొప్ప వ్యక్తుల జీవితాలు, ఆలోచనల నుంచి ప్రేరణ పొందవచ్చు. అలాంటి ఆలోచనలు జీవితంలో ముందుకు సాగడానికి ప్రతి ఒక్కరికీ సహాయపడతాయి. మహాభారతంలోని ముఖ్యమైన పాత్రలలో మహాత్మా విదురుడు ఒకరు. అతని తెలివితేటలు, జ్ఞానం, కృష్ణ భక్తి వలన విదురుడిని నేటికీప్రజలు గుర్తుంచుకుంటారు. మహాత్మా విదురుడు చెప్పిన విధానాలను విదుర నీతి అంటారు. మహాత్మా విదురుడు ఎప్పుడూ అసంతృప్తిగా ఉండే వ్యక్తుల గురించి తన నీతి శాస్త్రంలో చెప్పాడు. వీరు ఎప్పుడు సంతోషంగా ఉండరు.. దుఃఖ పడుతూనే జీవితాన్ని గడిపెస్తారని అన్నారు. అసూయ విదుర నీతి ప్రకారం ఇతరుల పురోగతిని చూసి అసూయపడే వ్యక్తి తన జీవితంలో ఎప్పుడూ విచారంగా ఉంటాడు. ఈ రకమైన గుణం అంటే అసూయ గుణం వ్యక్తులకు ఆత్మవిశ్వాసం తక్కువగా ఉంటుంది. అసూయతో జీవించే వ్యక్తి అవతలి వ్యక్తిలో ప్రతికూలత ఆలోచనలను కూడా పెంచుతాడు. ద్వేషించే గుణం ద్వేషం లేదా అసహ్యం అనేది మిమ్మల్ని లోపలి నుంచి దహించి వేసే భావన . ఇతరుల పట్ల అకారణ ద్వేషం ఉన్న వ్యక్తి చివరికి ప్రతికూలత ను ఒంటరితనాన్ని ఎంచుకుంటాడు. అది తప్ప వీరికి మరేమీ మిగలదు. ఇతరులను ద్వేషించే వ్యక్తి తన దగ్గరి బంధువుల నుంచి కూడా దూరం అవుతాడు.

### గబ్బిలాల నుంచి వీటిని నేర్చుకుంటే.. జీవితంలో ఎప్పటికీ బాధపడరు.

అసంతృప్తి జీవితంలో సంతోషంగా ఉండాలంటే ఉన్నదానితో సంతృప్తి చెందాలి. విదుర నీతి ప్రకారం తనకి ఉన్న దానితో సంతృప్తి చెందని వ్యక్తి ఎల్లప్పుడూ అసంతృప్తిగా ఉంటాడు. అలాంటి వారికి ఆనంద సాధనాలు ఉన్నప్పటికీ వారు ఎప్పుడూ సంతోషంగా ఉండరు.

### కోపం- అనుమానం

కోపంగా ఉన్న వ్యక్తి జీవితంలో ఎప్పుడూ దుఃఖం ఉంటుందని మహాత్మా విదురుడు అన్నాడు. అధికంగా కోపం తెచ్చుకునే వ్యక్తి జీవితంలో సంబంధాలపై ప్రభావం చూపిస్తుంది. సంబంధాలను కూడా పాడు చేస్తుంది. ఇంకా విదుర నీతిలో ప్రతి చిన్న విషయాన్ని అనుమానించి, తన జీవితాన్ని నిత్యం సందేహంతో గడిపే వ్యక్తి జీవితం దుఃఖించదాంతోనే గడిచిపోతుందని చెప్పాడు. ఇతరులపై ఆధారపడి ఉండటం కష్టపడి పనిచేయడం ద్వారానే విజయం లభిస్తుంది. కష్టపడి పనిచేయడం మానేసి ఇతరులపై ఆధారపడే వ్యక్తికి సమాజంలో తగినంత గౌరవం లభించదు. అలాంటి వ్యక్తి ఎల్లప్పుడూ సంతోషంగా ఉండడు.

తొలివార్త
RNI : TGTEL/25/A0357
మంగళవారం 10 - 11 - 2026

# వీడియోకాన్ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ ధూత్ దివాలా

**వీడియోకాన్ ఇండస్ట్రీస్ మాజీ ప్రమోటర్, డైరెక్టర్ వేణుగోపాల్ ధూత్ దివాలా తీశారు. ఈ మేరకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ప్రకటించింది.**

వీడియోకాన్ ఇండస్ట్రీస్ మాజీ ప్రమోటర్, డైరెక్టర్ అయిన వేణుగోపాల్ ధూత్ దివాలా తీసినట్లు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ముంబయి బెంచ్ ప్రకటించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెందిన రూ. 12,668 కోట్ల రుణ బకాయిల ఎగవేత కేసులో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియ, ప్రతిపాదిత రుణ చెల్లింపు ప్రణాళిక విఫలమైన తర్వాత, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌ను అనుసరించి, ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ కింద బీజూ ఈ ఉత్తర్వును జారీ చేసింది.వీడియోకాన్ ఇండస్ట్రీస్, వీడియోకాన్ టెలికమ్యూనికేషన్స్‌తో సహా గ్రూప్ కంపెనీల తరపున ధూత్ వ్యక్తిగత హామీలు ఇచ్చిన రుణాలపై డిఫాల్ట్‌లు జరగడంతో, బ్యాంకులు 2018 ఫిబ్రవరిలోనే క్లెయిమ్‌లను ప్రారంభించాయి. వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా, సిలిగుడిలోని ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ నుంచి సేకరించిన రూ. 600 కోట్లను 36 నెలల్లో తిరిగి చెల్లించే ప్రణాళికను ధూత్ ప్రతిపాదించారు. ఎటువంటి ముందస్తు చెల్లింపు లేకపోవడం, అంచనా వేసిన భవిష్యత్ చెల్లింపులపై విశ్వాసం లేకపోవడాన్ని ఉటంకిస్తూ రుణదాతలు ఈ ప్రతిపాదనను తిరస్కరించారు.ఫలితంగా, జులైలో ఎన్‌సీఎల్‌టీ ప్రాథమిక ప్రక్రియను ముగించి, పూర్తిస్థాయి దివాలా చర్యలకు అధికారం ఇచ్చింది. దీని ఫలితంగా ఈ తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ధర్మాసనం ఆశిశ్? నారాయణ్‌ను దివాలా ట్రస్టీగా నియమించి, రుణదాతల నుంచి క్లెయిమ్‌లను ఆహ్వానించాలని ఆదేశించింది. 90 రోజుల్లోగా ప్రాథమిక నివేదికను సమర్పించాలని ట్రస్టీకి సూచించింది. అదనంగా, ధూత్‌కు తన ఆర్థిక వివరాలను సమర్పించడానికి ఏడు రోజుల గడువు ఇచ్చింది."దివాలా తీసిన వ్యక్తి (ధూత్) తన ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వివరాలను నిర్ణీత ఫారమ్‌లో ఈ ఉత్తర్వు జారీ చేసిన తేదీ నుంచి (అంటే దివాలా ప్రక్రియ ప్రారంభమైన తేదీ నుంచి) ఏడు రోజుల్లోపు బ్యాంకరప్సీ ట్రస్టీకి సమర్పించాలి. అంతేకాకుండా, బ్యాంకరప్సీ ట్రస్టీ 90 రోజుల్లోపు ట్రిబ్యునల్‌కు, రుణదాతల కమిటీకి ప్రాథమిక నివేదికను సమర్పించాలి. ఆ తర్వాత త్రైమాసిక పురోగతి నివేదికలను కూడా అందించాల్సి ఉంటుంది. ఈ దివాలా ప్రక్రియ కోడ్‌లోని సెక్షన్ 138 కింద రుణగ్రహీతకు విముక్తి లభించే వరకు కొనసాగుతుంది" అని బీజూ తన 12 పేజీల ఉత్తర్వులో పేర్కొంది.ఇదిలా ఉండగా, వీడియోకాన్ టెలికమ్యూనికేషన్స్ లిమిటెడ్ సంస్థ తో పాటు దాని పూర్వపు అనుబంధ బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్? బ్యాంక్ ఆఫ్? మైసూర్, స్టేట్? బ్యాంక్? ఆఫ్ ట్రావెన్‌కూర్, బికనీర్ అండ్ జైపూర్, పాటియాలా బ్యాంకుల నుంచి రుణ సౌకర్యాలు పొందింది. అయితే, చెల్లింపులు విషయంలో విఫలమైంది. ఎస్బీ× పిటిషన్? ప్రకారం, 2026 సెప్టెంబర్ 30 నాటికి వడ్డీలు, జరిమానాలతో కలిపి చెల్లించని మొత్తం రూ. 12,668.06 కోట్లు. అందులో రూ. 9,322.10 కోట్ల రూపాయి టర్మ్ లోన్, రూ. 1,437.76 కోట్ల విటిఎల్ లోన్, రూ. 1,908.19 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ లోన్ ఉన్నాయి.ధూత్ ప్రతిపాదించిన ఈ రూ. 600 కోట్ల ప్లాన్‌లో ఎలాంటి ముందస్తు చెల్లింపులు లేకపోవడం, పైగా ఇది భవిష్యత్తు ప్రాజెక్ట్ ఆమోదాలు, నగదు ప్రవాహాలపై ఆధారపడి ఉండటంతో దీనిని ఐబీసీ నిబంధనల ప్రకారం తయారు చేయలేదని రెజల్యూషన్ ప్రొఫెషనల్ నివేదించారు. దీంతో జులై 17న ట్రిబ్యునల్ ఆ ప్లాన్‌ను తిరస్కరించి, ప్రక్రియను ముగించింది. అనంతరం, ఎస్‌బీఐ సెప్టెంబర్ 24న దివాలా పిటిషన్ దాఖలు చేయగా, ఎన్‌సీఎల్‌టీ నిబంధనలకు అనుగుణంగా ఉందని సంతృప్తి చెందుతూ ఈ పిటిషన్‌ను ఆమోదించి ధూత్‌ను బ్యాంక్రప్ట్‌గా ప్రకటించింది. విచారణ సమయంలో ధూత్ తరఫున ఎవరూ హాజరు కాలేదని కోర్టు రికార్డులు స్పష్టం చేశాయి.

# ఏఐ దెబ్బ.. స్మార్ట్‌ఫోన్ల ధరలకు రెక్కలు!

**సామాన్యులపై భారీ భారం**

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా పెరగనున్న స్మార్ట్‌ఫోన్ల ధరలు**

**బడ్జెట్ ఫోన్ల ధర 30 శాతం వరకు పెరిగే అవకాశం**

**మెమరీ చిప్‌లకు భారీ డిమాండ్‌తో ఆకాశాన్నంటిన ధరలు**

**కొత్త ఫోన్ల బదులు సెకండ్ హ్యాండ్ మార్కెట్ వైపు చూడనున్న వినియోగదారులు**

**తగ్గనున్న బడ్జెట్ ఫోన్ల వాటా, పెరగనున్న ప్రీమియం ఫోన్ల వాటా**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ప్రపంచవ్యాప్తంగా దూసుకెళ్తున్న వేళ, దాని ప్రభావం ఇప్పుడు నేరుగా సామాన్యుడి జేబుపై పడనుంది. కొత్తగా స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది చేదువార్త. రానున్న రోజుల్లో ఫోన్ల ధరలు, ముఖ్యంగా బడ్జెట్ ఆండ్రాయిడ్ ఫోన్ల ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ పెరుగుదల ఏకంగా 30% వరకు ఉండొచ్చని ప్రముఖ గ్లోబల్ రీసెర్చ్ సంస్థ జెఫరీస్ తన తాజా నివేదికలో హెచ్చరించింది.ఏఐ టెక్నాలజీకి గుండెలాంటి ప్రాసెసర్లు, మెమరీ చిప్‌లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. జెమిని, చాట్‌జీపీటీ వంటి ఏఐ అప్లికేషన్ల కోసం టెక్ దిగ్గజాలు భారీ డేటా సెంటర్లను నిర్మిస్తున్నాయి. దీనికోసం మార్కెట్‌లోని మెమరీ చిప్‌లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుండటంతో స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలకు తీవ్ర కొరత ఏర్పడింది. ఫలితంగా, గతంలో 20 డాలర్లు (సుమారు రూ.1,680) పలికిన ఒక మెమరీ యూనిట్ ధర, ఇప్పుడు మూడు రెట్లు పెరిగి 60 నుంచి 65 డాలర్లకు (సుమారు రూ.5,000) చేరింది.ఈ ధరల పెరుగుదల ప్రభావం ముఖ్యంగా రూ.16,000 లోపు లభించే బడ్జెట్ ఫోన్లపైనే ఎక్కువగా పడనుంది. ఎందుకంటే, ఈ ఫోన్ల తయారీ ఖర్చులో దాదాపు 60% మెమరీ చిప్‌లదే ఉంటుంది. దీంతో పెరిగిన భారాన్ని కంపెనీలు తప్పనిసరిగా వినియోగదారులపై మోపేందుకు సిద్ధమవుతున్నాయి. ధరలు పెరగడంతో చాలా మంది కొత్త ఫోన్ల కొనుగోలును వాయిదా వేసుకోవడం లేదా సెకండ్ హ్యాండ్ (రీఫర్బిష్డ్) ఫోన్ల వైపు మొగ్గు చూపవచ్చని జెఫరీస్ అంచనా వేసింది.ఈ పరిణామాలతో ప్రపంచ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోనూ గణనీయమైన మార్పులు రానున్నాయి. 200 డాలర్ల లోపు ఫోన్ల మార్కెట్ వాటా 42% నుంచి 24%కి పడిపోనుండగా, 600 డాలర్ల కంటే ఎక్కువ విలువైన ప్రీమియం ఫోన్ల వాటా 29% నుంచి 38%కి పెరుగుతుందని నివేదిక తెలిపింది. తయారీ వ్యయాన్ని తగ్గించుకోవడానికి కొన్ని కంపెనీలు కొత్త ఫోన్లలో పాత తరం ప్రాసెసర్లను వాడే అవకాశం ఉందని, అలాగే తక్కువ ధర మోడళ్ల సంఖ్యను తగ్గించుకునే యోచనలో ఉన్నాయని పేర్కొంది. ఏఐ కంపెనీలు 2027 నాటికి సుమారు 1.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నందున, మెమరీ చిప్‌ల ధరలు 2027 మధ్యకాలం వరకు గరిష్ఠ స్థాయిలోనే కొనసాగవచ్చని జెఫరీస్ స్పష్టం చేసింది.

# దలాల్ స్ట్రీట్‌లో దీపావళి వెలుగులు

## సెన్సెక్స్ 1,600 పాయింట్ల ప్లస్- భారీ లాభాల్లో సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోరు కొనసాగుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలు, ముడిచమురు ధరలు తగ్గడం మార్కెట్లకు కలిసొచ్చాయి. దీంతో గురువారం (నవంబర్ 5) ట్రేడింగ్ ప్రారంభంలోనే సూచీలు భారీగా పెరిగాయి. సెన్సెక్స్ ఏకంగా 1,600 పాయింట్లకు పైగా ఎగబాకగా, నిఫ్టీ కూడా 24 వేల మార్కును దాటి దూసుకెళ్లింది. అటు విదేశీ పెట్టుబడిదారులు కూడా భారతీయ మార్కెట్లలో మళ్లీ పెట్టుబడులు పెడుతుండటంతో మదుపర్లలో ఉత్సాహం కనిపిస్తోంది.గురువారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలో బీఎస్ఈ సెన్సెక్స్ 1,609.54 పాయింట్లు పెరిగి 78,910.94 వద్దకు చేరింది. అంటే దాదాపు 2.08 శాతం లాభపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 417.45 పాయింట్లు పెరిగి 24,378.05 వద్దకు చేరింది. ఇది 1.74 శాతం వృద్ధి. ఉదయం 9.50 గంటల సమయంలోనూ ఇదే జోరు కొనసాగింది. సెన్సెక్స్ 1,605 పాయింట్ల లాభంతో 78,906 వద్ద, నిఫ్టీ 453 పాయింట్ల పెరుగుదలతో 24,414 వద్ద ట్రేడయ్యాయి. దాదాపు అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి.మార్కెట్లకు కలిసొచ్చిన అమెరికా ఎన్నికల ఫలితాలఅమెరికాలో జరిగిన మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలు అంతర్జాతీయ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ సెనేట్, ప్రతినిధుల సభ రెండింటిలోనూ ఆధిపత్యం సాధించింది. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలింది. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మార్కెట్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. అమెరికా స్టాక్ మార్కెట్‌లో డోజోన్స్ సూచీ 1,500 పాయింట్లకు పైగా పెరిగింది. ఎస్అండ్‌పీ 500 సూచీ 1.58 శాతం, నాస్‌డాక్ 1.44 శాతం లాభపడ్డాయి. అక్కడి మార్కెట్లలో కనిపించిన ఈ సానుకూల ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. అంతర్జాతీయంగా మదుపర్లలో రిస్క్ తీసుకునే ధోరణి పెరగడంతో భారతీయ ఈక్విటీల్లోనూ కొనుగోళ్లు ఊపందుకున్నాయి.100 డాలర్ల దిగువకు ముడిచమురుదేశీయ మార్కెట్ల ర్యాలీకి మరో ప్రధాన కారణం ముడిచమురు ధరలు తగ్గడం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే అవకాశం ఉందనే అంచనాలతో అంతర్జాతీయంగా చమురు ధరలు దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల దిగువకు చేరింది. ట్రేడింగ్ సమయంలో 93.5 డాలర్ల స్థాయికి పడిపోయి రెండు నెలల కనిష్ఠాన్ని తాకింది. అనంతరం 94 డాలర్ల వద్ద కొనసాగింది. భారత్ తన చమురు అవసరాల్లో ఎక్కువ భాగాన్ని దిగుమతి చేసుకుంటుంది. అందువల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గితే దేశానికి దిగుమతి ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. దీనివల్ల ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గడంతో పాటు చమురు వినియోగించే రంగాల కంపెనీలకు కూడా ప్రయోజనం కలగొచ్చు. ఈ అంచనాలు మార్కెట్లలో కొనుగోళ్లకు ఊతమిచ్చాయి.భారతీయ షేర్లలోకి విదేశీ పెట్టుబడులువిదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) మళ్లీ భారతీయ మార్కెట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. నవంబర్ నెలలో కేవలం మూడు ట్రేడింగ్ సెషన్లలోనే భారతీయ ఈక్విటీల్లోకి సుమారు రూ.17,235 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం తిరిగి మొదలవడం మార్కెట్లకు సానుకూల పరిణామంగా మారింది. తగ్గిన ముడిచమురు ధరలు, అంతర్జాతీయంగా మెరుగైన పరిస్థితులు, సంస్థాగత పెట్టుబడుల రాక మార్కెట్ల ర్యాలీకి ప్రధాన బలంగా నిలుస్తున్నాయని ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ తెలిపారు. అయితే ట్రేడింగ్ ప్రారంభంలో వచ్చిన లాభాలను మార్కెట్లు కొనసాగించగలుగుతాయా లేదా అన్నది కీలకమని చెప్పారు. విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు కొనసాగితే దేశీయ మార్కెట్లకు మరింత మద్దతు లభిస్తుందని అభిప్రాయపడ్డారు.అన్ని రంగాల్లోనూ కొనుగోళ్ల జోరుఈ ర్యాలీ కేవలం కొన్ని షేర్లకే పరిమితం కాలేదు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.46 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.49 శాతం పెరిగాయి. నిఫ్టీ 100 సూచీ 1.78 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ప్రైవేట్ బ్యాంక్ షేర్లు ముందంజలో నిలిచాయి. నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్ సూచీ 2.55 శాతం పెరిగింది. రియల్టీ రంగం 1.92 శాతం, ఐటీ 1.72 శాతం, ఆటో 1.66 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.52 శాతం, మీడియా 1.36 శాతం, ఎఫ్ఎంసీజీ 1.08 శాతం లాభపడ్డాయి. ఉదయం ట్రేడింగ్‌లో ఆటో రంగ సూచీ మరింత ఉత్సాహంగా కనిపించింది. నిఫ్టీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు రాణించాయి. ఫార్మా రంగం మినహా దాదాపు అన్ని రంగాల్లో కొనుగోళ్లు కనిపించాయి. మరోవైపు డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా, కోల్ ఇండియా, ఎయిర్‌టెల్ షేర్లు స్వల్ప నష్టాల్లో కొనసాగాయి.ఆసియా మార్కెట్లలోనూ మిశ్రమ ధోరణిఇతర ఆసియా మార్కెట్లలో మాత్రం మిశ్రమ పరిస్థితులు కనిపించాయి. హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 3.36 శాతం పెరిగింది. సింగపూర్ స్ట్రెయిట్స్ టైమ్స్ 0.10 శాతం లాభపడింది. మరోవైపు జపాన్ నిక్కీ 225 సూచీ 0.58 శాతం, తైవాన్ వెయిటెడ్ 1.67 శాతం నష్టపోయాయి. దక్షిణ కొరియా కోస్పీ సూచీ దాదాపు 4 శాతం పడిపోయింది.

# ట్రావెల్స్ వ్యాపారులకు టయోటా గుడ్‌న్యూస్

**ఇన్నోవా క్రిస్టా లిమో వచ్చేసింది!**

**ఇన్నోవా క్రిస్టా లిమోను విడుదల చేసిన టయోటా**

**ప్రారంభ ధర రూ.19.95 లక్షలు.. 2.4 లీటర్ల డీజిల్ ఇంజిన్**

**ఏడు, ఎనిమిది సీట్ల వెర్షన్లు అందుబాటులోకి**

**మాన్యువల్ గేర్‌బాక్స్‌తో కొత్త వేరియంట్**




ప్రముఖ కార్ల తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ భారత మార్కెట్లోకి కొత్త ఇన్నోవా క్రిస్టా లిమో వేరియంట్‌ను తీసుకొచ్చింది. ప్రధానంగా టాక్సీ, ట్రావెల్స్ సంస్థలు, ఇతర వాణిజ్య వాహన నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని దీన్ని రూపొందించింది. ఏడు సీట్ల వెర్షన్ ధరను రూ.19.95 లక్షలుగా, ఎనిమిది సీట్ల వెర్షన్ ధరను రూ.19.99 లక్షలుగా నిర్ణయించింది. ఇవి ఎక్స్‌షోరూమ్ ధరలు.ఇన్నోవా క్రిస్టా లిమోను ప్రత్యేకంగా జీఎక్స్-ఎస్ఎల్ఎఫ్ గ్రేడ్‌లో అందిస్తోంది. సాధారణ ఇన్నోవాతో పోలిస్తే ఇంజిన్, గేర్‌బాక్స్ విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కెప్టెన్ సీట్లను కూడా అందిస్తోంది. రెండో వరుసలో వ్యక్తిగత సీటింగ్‌కు ప్రాధాన్యమిచ్చే వారు ఏడు సీట్ల వెర్షన్‌ను ఎంచుకోవచ్చు. అదనంగా మరో ప్రయాణికుడికి చోటు కల్పించేలా ఎనిమిది సీట్ల వెర్షన్‌ను రూపొందించింది.ఈ వాహనంలో 2.4 లీటర్ల నాలుగు సిలిండర్ల డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. దీనికి మాన్యువల్ గేర్‌బాక్స్‌ను జత చేశారు. సాధారణ ఇన్నోవా క్రిస్టా గరిష్ఠంగా లీటరుకు 15 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ ధ్రువీకరించింది. సుదూర ప్రయాణాలు, తరచూ ప్రయాణికులను తీసుకెళ్లే వాణిజ్య అవసరాలకు ఇది అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు.కొనుగోలుదారులకు మూడేళ్లు లేదా లక్ష కిలోమీటర్ల వరకు ప్రామాణిక వారంటీ లభిస్తుంది. అదనపు మొత్తంతో ఐదేళ్లు లేదా 2.20 లక్షల కిలోమీటర్ల వరకు వారంటీని పొడిగించుకోవచ్చు. ఏడేళ్ల వరకు ఫైనాన్స్ సదుపాయాలు, తక్కువ ఈఎంఐ పథకాలు, త్వరిత సర్వీసింగ్, 24 గంటల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సదుపాయాలను కూడా టయోటా అందిస్తోంది.

# అతడు లోన్ ఎగ్గొడితే.. మీరు కట్టాల్సిందేనా

**గ్యారంటీ సంతకం చేసే ముందు ఈ విషయాలు తెలుసుకోండి!**

**రుణ హామీదారుపైనా చట్టపరమైన బాధ్యత**

**రుణగ్రహీత ఎగవేస్తే బకాయిలు చెల్లించాల్సి రావచ్చుంటున్న నిబంధనలు**

**అత్యవసర పొదుపు సొమ్ముకు ముప్పు ఏర్పడే అవకాశం**

**మీ క్రెడిట్ స్కోర్ తగ్గే ప్రమాదమూ ఉందంటున్న నిపుణులు**

**భవిష్యత్తులో రుణ అర్హత ప్రభావితం కావచ్చని హెచ్చరిక**



స్నేహితుడో, బంధువో బ్యాంకు లోన్ తీసుకోవాలనుకున్నప్పుడు అర్హతలు సరిపోక మీ సాయం కోరవచ్చు. గ్యారంటీగా సంతకం చేయాలని అడగవచ్చు. వారి మీద నమ్మకంతో చాలామంది వెంటనే అంగీకరిస్తుంటారు. కానీ ఈ నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. ఎందుకంటే రుణానికి హామీదారుగా సంతకం చేయడం అంటే కేవలం స్నేహితుడికి సాయం చేయడం మాత్రమే కాదు.. అతడు లోన్ వాయిదాలు చెల్లించకపోతే ఆ బాధ్యతను మీరూ స్వీకరించడమే. భారత్‌లో రుణ హామీ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత, రుణగ్రహీత చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకు మిమ్మల్ని కూడా బాధ్యులుగా చేయవచ్చు.మీ సేవింగ్స్‌కూ ముప్పురుణగ్రహీత వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే, ఒప్పంద నిబంధనల ప్రకారం బ్యాంకు బకాయి మొత్తాన్ని మీ నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ఈ పరిణామం మీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అత్యవసర అవసరాల కోసం దాచుకున్న డబ్బు, భవిష్యత్తు ఖర్చుల కోసం కూడబెట్టిన సొమ్ము కూడా లోన్ చెల్లింపులకు వినియోగించాల్సి రావచ్చు. బకాయిలు అలాగే ఉంటే బ్యాంకు చట్టపరమైన చర్యలకూ దిగవచ్చు. కొన్ని పరిస్థితుల్లో మీ ఆస్తులకూ ముప్పు ఏర్పడవచ్చు.మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినొచ్చుమీరు తీసుకోని లోన్ కారణంగా మీ క్రెడిట్ హిస్టరీపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ప్రధాన రుణగ్రహీత వాయిదాలు సకాలంలో చెల్లించకపోయినా, లోన్ ఎగవేసినా ఆ వివరాలు క్రెడిట్ సమాచార సంస్థలకు చేరే అవకాశం ఉంది. దీంతో మీ క్రెడిట్ స్కోర్ తగ్గవచ్చు. భవిష్యత్తులో వ్యక్తిగత రుణం, గృహ రుణం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు మీ క్రెడిట్ హిస్టరీని పరిశీలిస్తాయి. అప్పుడు మీరు ఇప్పటివరకు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినా, హామీ ఇచ్చిన లోన్ ప్రతికూలతలు మీపై ప్రభావం చూపవచ్చు.భవిష్యత్తులో మీకు రుణం రావడం కష్టమవుతుందా?మరొకరి లోన్‌కు హామీగా నిలవడం మీ భవిష్యత్తు రుణ అర్హతపైనా ప్రభావం చూపవచ్చు. ఆ హామీని బ్యాంకులు మీపై ఉన్న ఆర్థిక బాధ్యతగా పరిగణించే అవకాశం ఉంది. మీరు సొంతంగా ఇల్లు కొనాలనుకున్నా, కారు తీసుకోవాలనుకున్నా లేదా వ్యక్తిగత అవసరాల కోసం రుణం కోరినా ఈ అంశాన్ని పరిశీలించవచ్చు. హామీగా ఉన్న మొత్తం ఎక్కువైతే, మీకు మంజూరయ్యే రుణ పరిమితి తగ్గే అవకాశముంది.హామీ ఇచ్చే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరిరుణానికి గ్యారంటీగా సంతకం చేసే ముందు ఒప్పందాన్ని పూర్తిగా చదవాలి. రుణగ్రహీత చెల్లించకపోతే మీపై పడే బాధ్యత ఎంత? వడ్డీ, ఆలస్య రుసుములు, జరిమానాలు సహా ఎంత మొత్తం చెల్లించాల్సి రావచ్చు? ఏ పరిస్థితుల్లో బ్యాంకు మీ నుంచి డబ్బు వసూలు చేయవచ్చు? వంటి అంశాలను స్పష్టంగా తెలుసుకోవాలి. రుణం తీసుకుంటున్న వ్యక్తి ఆదాయం ఎంత? ఇప్పటికే ఇతర రుణాలు ఉన్నాయా? గతంలో వాయిదాలను సక్రమంగా చెల్లించారా? అన్న విషయాలనూ పరిశీలించాలి.స్నేహితులు, బంధువులకు ఆర్థికంగా అండగా నిలవడం మంచి విషయమే. అయితే ఆ సాయం మీకు భారంగా మారకూడదు. రుణగ్రహీత చెల్లించకపోతే మొత్తం బకాయిని మీరే చెల్లించగలరా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోండి. ఆ బాధ్యతను భరించే పరిస్థితి లేకపోతే గ్యారంటీగా సంతకం చేయకపోవడమే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# రూపాయికి రెక్కలు, చమురుకు బ్రేకులు

**అమెరికా ఎన్నికల ఫలితాలతో భారత్‌కు ఊరట!**

**వరుసగా ఐదో రోజు బలపడిన భారత రూపాయి**

**భారీగా పతనమైన ముడి చమురు ధరలు**

**అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల గెలుపు ప్రభావం**

**ఇరాన్‌పై యుద్ధానికి ట్రంప్ వెనక్కి తగ్గే అవకాశం**

**సానుకూల సంకేతాలతో లాభాల్లో దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్లు**



అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో భారత ఆర్థిక వ్యవస్థకు ఊరట లభించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భారత రూపాయి వరుసగా ఐదో రోజు కూడా లాభపడింది. అదే సమయంలో ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. నేడు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 29 పైసలు బలపడి 94.35 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. నిన్న ముగింపు ధర 94.64గా ఉంది. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు నాలుగో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 1.16 డాలర్లు తగ్గి 93.46 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) ధర కూడా 1.47 డాలర్లు పడిపోయి 86.65 డాలర్ల వద్ద నిలిచింది. ఈ వారంలో ఇప్పటివరకు చమురు ధరలు దాదాపు 16 శాతం మేర తగ్గడం గమనార్హం.అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడమే ఈ పరిణామాలకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌లోని ఉభయ సభల్లోనూ డెమోక్రాట్లు విజయం సాధించడంతో ఇరాన్‌పై యుద్ధం విషయంలో ట్రంప్ దూకుడుకు కళ్లెం పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి వెళ్లకుండా, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ట్రంప్‌పై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఇరాన్‌పై దాడి చేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని స్వయంగా ట్రంప్ ప్రకటించడం కూడా మార్కెట్లకు ఊరటనిచ్చింది.ఈ సానుకూల సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా లాభపడి 78,910 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 417 పాయింట్లు పెరిగి 24,378 వద్ద ట్రేడింగ్ మొదలుపెట్టాయి.

# బ్లింకిట్ అంబులెన్స్ బుకింగ్‌లో కొత్త రూల్

**అత్యవసరం కాని ప్రయాణానికి రూ.2,500!**

**బ్లింకిట్ అంబులెన్స్ సేవల్లో కొత్త ఛార్జీలు**

**అత్యవసరం కాని ప్రయాణాలకు రూ.2,500 ఫీజు**


**అత్యవసర వైద్య సేవలు ఎప్పటిలాగే ఉచితం**

**రెండేళ్లలో 42 వేల కేసులకు సేవలు**

**సాధారణ ప్రయాణాల వల్ల అంబులెన్స్‌ల కొరత**




క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ తన అంబులెన్స్ సేవల్లో కీలక మార్పు చేసింది. అత్యవసర వైద్య పరిస్థితుల్లో రోగులను తరలించేందుకు అందించే అంబులెన్స్ సేవలు ఉచితంగానే కొనసాగుతాయని ప్రకటించింది. అయితే అత్యవసరం కాని ప్రయాణాలకు ఇకపై రూ.2,500 ఫ్లాట్ ఫీజు వసూలు చేయనుంది. అంబులెన్స్‌లు సాధారణ అవసరాలకు కాకుండా.. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి అందుబాటులో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.ఎటర్నల్ వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ గురువారం ఈ మార్పును ప్రకటించారు. డాక్టర్ సంప్రదింపులు, సాధారణ వైద్య పరీక్షలు, ఆసుపత్రికి వెళ్లడం, ఆసుపత్రి నుంచి ఇంటికి రావడం వంటి అత్యవసరం కాని అవసరాలకు కూడా అంబులెన్స్‌లను వినియోగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రయాణాలకు సాధారణ వాహనాలు లేదా ప్రైవేటు రవాణా సేవలను ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు.గత రెండేళ్లలో బ్లింకిట్ అంబులెన్స్ సేవల ద్వారా మొత్తం 42 వేల కేసులకు స్పందించామని గోయల్ వెల్లడించారు. వీటిలో దాదాపు 20 వేల అత్యవసర కేసులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఏ ఒక్కరి నుంచీ ఎలాంటి ఛార్జీ వసూలు చేయలేదని, అత్యవసర సేవలను భవిష్యత్తులోనూ ఉచితంగానే కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అయితే, రోగులకు సంబంధించి అన్ని రకాల ప్రయాణాలకు ఉచిత సేవ అందుబాటులో ఉండటంతో సాధారణ అవసరాల కోసం అంబులెన్స్ బుకింగ్‌లు పెరుగుతున్నాయని సంస్థ గుర్తించింది. ప్రైవేటు అంబులెన్స్‌లు వసూలు చేసే ఛార్జీలకు దగ్గరగానే ఈ మొత్తాన్ని నిర్ణయించినట్లు గోయల్ తెలిపారు. ఈ రూపంలో వచ్చే ఆదాయాన్ని ఎటర్నల్ ఫౌండేషన్‌కు అందజేస్తామని, అంబులెన్స్ సేవల విస్తరణకు వినియోగిస్తామని చెప్పారు.పది నిమిషాల్లో అంబులెన్స్ అందించే సేవలు వేలాది ప్రాణాలను కాపాడగలవని, అందుకే వాటిని అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందని గోయల్ పేర్కొన్నారు.




## ‘రామాయణ’పై మహేష్ బాబు ప్రశంసలు.. ‘వారణాసి’లో శ్రీరాముడిగా ఎలా కనిపిస్తారోనని చర్చ..!

సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా ‘రామాయణం’ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ భారీ పౌరాణిక చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్, నటీనటుల అభినయం, భారీ నిర్మాణ విలువలపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, అట్లీ వంటి పలువురు ఈ చిత్రాన్ని మెచ్చుకోగా.. తాజాగా మహేష్ బాబు కూడా తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ‘రామాయణ’ పార్ట్-1 సినిమా చూసిన మహేష్ బాబు.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన పురాణ గాథను ఇంత అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవిల నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇంత భారీ స్థాయిలో సినిమాను నిర్మించడానికి కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ‘రామాయణ’ చిత్ర బృందం మొత్తం అభినందనలకు అర్హులని మహేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఆయన తదుపరి చిత్రం ‘వారణాసి’ గురించి కూడా చర్చకు దారితీసింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ఈ భారీ చిత్రం సోషియో ఫాంటసీ, టైమ్ ట్రావెల్, మైథలాజికల్ అంశాల కలయికతో రూపొందుతోంది. ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ అత్యంత కీలకంగా ఉండనుంది. ఈ చిత్రంలో మహేష్ బాబు తొలిసారిగా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణ ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. రాముడి పాత్ర కోసం మహేష్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. మహేష్ బాబును శ్రీరాముడి పాత్రలో చూపించేందుకు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. లుక్ టెస్ట్ సమయంలో మహేష్‌ను రాముడి గెటప్‌లో చూసి తాను ఆశ్చర్యపోయానని గతంలో రాజమౌళి వెల్లడించారు. దీంతో ‘వారణాసి’లో మహేష్ రాముడి అవతారంలో ఎలా కనిపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.ఇక ‘రామాయణం’ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, మహేష్ బాబు రాముడి పాత్రలో ఎలా మెప్పిస్తారనే చర్చ మొదలైంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే పౌరాణిక పాత్రలో కనిపించనుండటంతో అభిమానులు ఈ రెండు చిత్రాలపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు.

## విజయ్ సేతుపతికి అరుదైన గౌరవం.. తొలి భారతీయ నటుడిగా ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేదికపై చరిత్ర!




తమిళ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకోబోతున్నారు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను మెప్పిస్తున్న ఆయన ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినీ ప్రతిభకు ప్రతినిధిగా నిలవబోతున్నారు. ప్రతిష్ఠాత్మక 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించే అవకాశం విజయ్ సేతుపతికి దక్కింది. ఈ ఘనత సాధించనున్న తొలి భారతీయ నటుడిగా ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డులను అందిస్తారు. ఈ ఏడాది 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుక నవంబర్ 23, 2026న న్యూయార్క్‌లో జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు పాల్గొనే ఈ వేడుకలో అవార్డులు అందించే ప్రెజెంటర్లలో విజయ్ సేతుపతి కూడా ఉండనున్నారు. భారతీయ నటుడికి ఇలాంటి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు దక్కడం సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. గతంలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా 2016లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్‌స్టన్‌తో కలిసి అవార్డును అందించారు. అయితే ప్రైమ్‌టైమ్ ఎమ్మీ, ఇంటర్నేషనల్ ఎమ్మీ రెండూ వేర్వేరు అవార్డుల వేడుకలు. ఇప్పుడు విజయ్ సేతుపతికి ఇంటర్నేషనల్ ఎమ్మీ వేదికపై ప్రెజెంటర్‌గా అవకాశం రావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

## సూర్య ‘సీన్’ ఓటీటీ రిలీజ్ టైం ఫిక్స్ నెట్‌ఫ్లిక్స్‌లో ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ కానుందంటే!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య మరోసారి పోలీస్ ఆఫీసర్ పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ ‘సీన్’ దీపావళి కానుకగా నవంబర్ 6న థియేటర్లలో విడుదలైంది. ‘ఆవేశం’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు జిత్తు మాధవన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చాలా కాలం తర్వాత సూర్య పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. థియేటర్లలో విడుదలైన ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీపై అభిమానులు ఆరా తీస్తున్నారు. ‘సీన్’ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. సాధారణంగా థియేటర్లలో విడుదలైన సినిమాలు నాలుగు నుంచి ఆరు వారాల తర్వాత ఓటీటీలోకి వస్తున్నాయి. ఇదే విధానాన్ని అనుసరిస్తే ‘సీన్’ సినిమా డిసెంబర్‌లో డిజిటల్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా డిసెంబర్ మొదటి వారం లేదా మూడో వారంలో స్ట్రీమింగ్ కావచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఓటీటీ విడుదల తేదీపై నెట్‌ఫ్లిక్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. థియేటర్లలో సినిమా ప్రదర్శన, ప్రేక్షకుల స్పందనను బట్టి విడుదల తేదీలో మార్పులు ఉండవచ్చు. ఈ సినిమాలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ నటించారు. వీరిద్దరి కలయిక సినిమాపై ప్రత్యేక ఆసక్తిని పెంచింది. అంతేకాకుండా నస్లేన్, లాల్, ఆనందరాజ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సుశిన్ శ్యామ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరమ్ స్టూడియోస్ బ్యానర్లపై సూర్య, జ్యోతిక సంయుక్తంగా నిర్మించారు. యాక్షన్‌తో పాటు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అంశాలను మేళవించి దర్శకుడు ఈ సినిమాను రూపొందించారు. సీన్ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ సినిమాలో సూర్య ఇన్బరాజ్ అనే పోలీస్ అధికారిగా కనిపించారు. పోలీస్ శాఖలో మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్న ఇన్బరాజ్ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల తన ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. అయితే గతంలో ఆయన పరిష్కరించకుండా వదిలేసిన ఒక కేసు మరోసారి తెరపైకి వస్తుంది. దీంతో ఆ కేసును ఎలాగైనా పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతుంది.ఈ నేపథ్యంలో ఇన్బరాజ్ మరోసారి కేసు దర్యాప్తులోకి దిగాల్సి వస్తుంది. అయితే ఈసారి ఆయనకు ఎదురయ్యే పరిస్థితులు అంత సులభంగా ఉండవు. సమస్యాత్మకమైన, గందరగోళమైన ఓ పోలీస్ బృందంతో కలిసి దర్యాప్తు కొనసాగించాల్సి వస్తుంది. గతంలో పరిష్కారం కాని ఆ కేసు వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి? పాత కేసుకు, ఇప్పుడు ఎదురైన పరిణామాలకు ఉన్న సంబంధం ఏంటి? మంచి పేరున్న సిన్సియర్ పోలీస్ అధికారి ఇన్బరాజ్ ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశాడు? చివరకు ఈ కేసును ఎలా పరిష్కరించాడు? అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉండనుంది.




## బాలయ్య ‘దాదా’లో క్రేజీ ఐటెం సాంగ్.. థమన్ ఈసారి కూడా మాస్ బీట్‌తో దుమ్మురేపనున్నాడా?




నందమూరి నటసింహం బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ‘దాదా’ ఒకటి. గతంలో బాలయ్యతో ‘వీరసింహారెడ్డి’ వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్ణయించిన సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం కష్టపడుతోంది. మరోవైపు ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న ఎస్.ఎస్. థమన్ విషయంలోనూ అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలో ఓ అదిరిపోయే ఐటెం సాంగ్ ఉండబోతుందనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణ, థమన్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా థమన్ అందించే బాణీలు థియేటర్లలో అభిమానులతో విజిల్స్ వేయిస్తుంటాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాల్లో పాటలు మంచి ఆదరణ పొందడంతో ‘దాదా’పై కూడా సంగీతం విషయంలో అంచనాలు పెరిగాయి. ఇప్పటికే బాలకృష్ణ సినిమాల్లో ఐటెం సాంగ్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా థమన్ అందించే బీట్స్ ఈ పాటలకు మరింత ఊపునిస్తుంటాయి. ఇప్పుడు ‘దాదా’ సినిమాలో కూడా ఓ ప్రత్యేకమైన ఐటెం సాంగ్ ఉండబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ పాట కోసం థమన్ అదిరిపోయే మాస్ బీట్స్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రత్యేక పాటలో బాలయ్యతో కలిసి స్టెప్పులు వేసే బ్యూటీ ఎవరనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతంలో బాలయ్య సినిమాల్లో ప్రత్యేక పాటలు చేసిన హీరోయిన్ల తరహాలో ఈసారి కూడా ఓ క్రేజీ హీరోయిన్‌ను తీసుకురాబోతున్నారా? అనే చర్చ జరుగుతోంది. అయితే ఈ పాటలో నటించబోయే హీరోయిన్ ఎవరు? పాట చిత్రీకరణ ఎప్పుడు జరగనుంది? అనే విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి.

PUBLISHED AND OWNER BY LINGALA NARENDER Published at 10-1-1-/A, THRIMURTHY COLONY,PRIYADARSHINI PARK BESIDE,SAROOR NAGAR,RANGAREDDY District TELANGANA - 500035. Printed at SMILYSONLINE 6-7-48,VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY District,TELANGANA - 500070. EDITOR LINGALA NARENDER RNI NO. : TGTEL/25/A0357 ,CELL : 9010880040